నిఘా నిద్రపోతోంది.. నేరం బుసలు కొడుతోంది



- పాత నేరస్థుల కదలికలపై కొరవడిన పోలీసుల పర్యవేక్షణ
- పురంలో యథేచ్ఛగా నేరాలు.. ఘోరాలు

హిందూపురం పట్టణం, న్యూస్‌టుడే: హిందూపురం పోలీసు డివిజన్‌లో పాత నేరస్థులపై నిఘా కొరవడింది. వారి కదలికలను పట్టించుకోకపోవడంతో నేరస్థులు రెచ్చిపోతున్నారు. యథేచ్ఛగా నేరాలు, ఘోరాలకు పాల్పడుతున్నారు. చిలమత్తూరు మండలంలో ఇటీవల అత్తా, కోడలిపై ఆరుగురు జరిపిన సామూహిక అత్యాచార ఘటనే ఇందుకు నిదర్శనం. ఈ ఘటనపై సీఎం స్థాయిలో స్పందించి చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో పోలీసులు 48 గంటల్లోపే కేసును ఛేదించారు. ఏ మాత్రం అలక్ష్యం చేసినా వారంతా ఇతర రాష్ట్రాలకు పారిపోయి ఉండేవారు. అయితే పోలీసులు గత ఐదేళ్లలో అలవడిన అలసత్వాన్ని వీడి ఉంటే, పాత నేరస్థులపై నిఘా ఉంచి ఉంటే.. ఈ ఘోరం అసలే జరిగేది కాదేమో. చిలమత్తూరు అత్యాచారం సంఘటనలో మొదటి నిందితుడిపై ఏకంగా 37 కేసులున్నాయి. నమోదు కానివి ఇంకెన్ని ఉన్నాయో తెలియదు. మిగిలిన నిందితులపైనా పలు పోలీసుస్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. వీరే కాదు.. ఇలాంటి తీవ్రమైన నేరాలకు పాల్పడి, కేసులు నమోదై.. అంతర్ రాష్ట్ర నేరస్థులుగా గుర్తింపబడినవారు హిందూపురం పట్టణంలోనే 30 మంది ఉన్నారు. గ్రామీణ మండలంలో మరో 10 మంది ఉన్నారు. వీరు దొంగతనాలే కాదు హత్యలు చేయడంలోనూ ఆరితేరారు. వారిలో ఒక్కొక్కరి మీద కనీసం 20-30 తీవ్ర నేరాలకు పాల్పడిన కేసులు ఉన్నాయి. వీరు నేరాలకు పాల్పడటం, ఆ తరువాత 90 రోజులకు బెయిల్‌పై బయటకు రావడం రివాజుగా మారింది.

పోలీసు పెట్రోలింగ్ ఏమైనట్లు?

జాతీయ రహదారిపై పోలీసు పెట్రోలింగ్ ప్రతి రాత్రి జరగాలి. అయితే పెట్రోలింగ్ నామమాత్రంగా మారింది. చివరకు పెట్రోలింగ్‌కు ఉపయోగించే వాహనం పాడైనా వైకాపా హయాంలో మరమ్మతులు చేయించలేదు. దీనికితోడు పెట్రోలింగ్‌కు నియమితులైన సిబ్బంది రాత్రి పూట విధులకు వెళ్లడం లేదని తెలుస్తోంది. సంస్థాగతంగా ఇన్ని లోపాలు ఉంటే.. నేరస్థులు రెచ్చిపోకుండా ఎలా ఉంటారనేది పోలీసు ఉన్నతాధికారులే ఆలోచన చేయాలి. ప్రస్తుతం అమలు అవుతున్న విధానాల్లో సమూల మార్పులు చేయడం, యంత్రాంగంలో ప్రక్షాళన చేయడం చేస్తేనే నేరాలకు అడ్డుకట్ట పడుతుంది.

పట్టించుకునేవారుంటేగా..

గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో నేరాలకు ఎక్కువగా పాల్పడేవారిని గుర్తించి, నేరస్థుల కదిలికలపై నిఘా ఉంచేవారు. రోజూ ఇంటి వద్దకు వెళ్లి వాకబు చేసేవారు. ఏ ప్రాంతానికైనా రాత్రిపూట నేరస్థుడు వెళ్లినట్లు గుర్తిస్తే, ఆ ప్రాంత పోలీసులకు వెంటనే సమాచారం ఇచ్చేవారు. గత ఐదేళ్ల వైకాపా ప్రభుత్వంలో నేరస్థులపై నిఘాకు మంగళం పాడేశారు. అధికార పార్టీ నాయకుల సేవలో మునిగితేలారు. దారుణంగా చంపినా, నడిరోడ్లపై దాడి చేసినా, మహిళల మెడలో గొలుసులను దొంగిలించినా, పట్టణంలోని



ప్రధాన రహదారి మీద ఉన్న దుకాణాల షట్టర్లు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడినా గత ఐదేళ్లు కఠిన చర్యలు లేవు. గంజాయి విక్రయాలు, బెట్టింగ్‌లు నిత్యకృత్యం అయ్యాయి. వారిని అడ్డుకొనే వ్యవస్థ లేకపోవడంతో నేరస్థులు ఇష్టారాజ్యంగా రెచ్చిపోయారు.

దశాబ్దాలుగా ఇక్కడే తిష్ఠ..

హిందూపురం ప్రాంతంలోని పోలీసు స్టేషన్లలో అనేక మంది పోలీసులు దశాబ్దాల తరబడి ఇక్కడే పనిచేస్తున్నారంటే ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. మూడేళ్లకు ఒక్కసారి వారిని దూర ప్రాంతాలకు బదిలీ చేయాల్సి ఉన్నా, సిఫార్సులతో ఇక్కడే పోస్టింగ్‌లు పొందుతున్నారు. ఒకటి రెండేళ్లు అలా వెళ్లి మళ్లీ ఇక్కడికే వచ్చేస్తున్నారు. ఒకచోట తిష్ఠ వేసినవారు, వివిధ కారణాలతో నేరాలు చేసే వారిపై కఠినంగా వ్యవహరించలేకపోతున్నారు. పోస్టింగ్ కోసం నాయకులను ఆశ్రయించడం, వారు చెప్పినట్లు చేయడం ఇక్కడ రివాజుగా మారింది.

నేరాలు జరగకుండా గట్టి చర్యలు

- మహేశ్, డీఎస్పీ, హిందూపురం

హిందూపురం ప్రాంతంలోని పాత నేరస్థుల వివరాలు సేకరిస్తున్నాం. వారిపై ఇక నుంచి తప్పకుండా నిఘా ఉంచుతాం. ఇతర ప్రాంతాల్లో నేరాలకు పాల్పడి పట్టణాన్ని షెల్టర్ జోన్‌గా వాడుకునేవారిపై కూడా చర్యలు తీసుకుంటాం. ఎవరినీ ఉపేక్షించేది లేదు. హిందూపురం ప్రాంతంలో నేరాలు జరగకుండా గట్టి చర్యలు ఉంటాయి.

రైతన్నలను కాపాడుకుందాం..!

మూడోసారి యాత్ర చేపట్టిన ప్రదీప్

ముదిగుబ్బ, న్యూస్‌టుడే : వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోవడం అనంతపురానికి చెందిన యువకుడు ప్రదీప్‌ను కదిలించాయి. గిట్టుబాటుకాక సేద్యం వదిలి పెయింటర్‌గా తన తండ్రి మారడంతో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రపంచానికి చాటి అన్నదాతలను కాపాడుకోవాలని అడుగేశాడు. రైతు సమస్యలను దేశమంతా తెలియజేసి.. పాలకుల్లో కదలిక తేవాలని 'సేవ్ ఫార్మర్' అనే నినాదంతో మూడోసారి ఆల్‌ఇండియా సైకిల్‌యాత్ర ఆదివారం ప్రారంభించాడు. అనంతపురంలో పిల్లిగుండ్ల కాలనీకి చెందిన పెయింటర్ నాగభూషణ, పుష్పలత కుమారుడు ప్రదీప్ నిత్యం రైతుల సంక్షేమం గురించి ఆలోచిస్తున్నాడు. రెండెకరాలు పొలం ఉన్న నాగభూషణ సేద్యం చేసి అప్పులుపాలై కాడెను వదిలేశారు. ఈ విధంగానే చాలా మంది రైతులు సేద్యం వదిలేసి పట్టణాలకు వలస వెళ్లి కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. దీన్ని గుర్తించిన ప్రదీప్ రైతులను కాపాడుకోవాలని.. అందుకు తను చేతనైనది చేయాలని ఇంటర్మీడియట్ చదువుతుండగానే 'సేవ్ ఫార్మర్' నినాదంతో చేతిలో ఒక్కరూపాయి లేకుండానే పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. 2021లో అనంతపురం నుంచి కన్యాకుమారి అక్కడ్నుంచి జమ్మూ కశ్మీర్, లద్దాక్ వరకు మొత్తం 18 వేల కిలోమీటర్లు పాదయాత్ర చేశాడు. కన్యాకుమారి దగ్గర వెళ్లే టప్పుడు కాళ్లు బొబ్బలు వచ్చినా పాదయాత్ర ఆపలేదు. ఏడాదిన్నర కాలంపాటు నడిచాడు. బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలు కూడా ప్రదీప్‌ను కదిలించేలా చేసింది. 2022లో 'సేవ్ ఫార్మర్స్ - సేవ్ గర్ల్స్' నినాదంతో అనంతపురం నుంచి నేపాల్ దేశ సరిహద్దు వరకు 6 వేల కిలోమీటర్లు సైకిల్ యాత్ర చేశాడు. 'నో ఫార్మర్స్-నో ఫుడ్.. సేవ్ ఫార్మర్స్, సేవ్ గర్ల్స్' నినాదాన్ని మరింత బలంగా పాలకులకు వినిపించాలనే ఉద్దేశంతో ప్రస్తుతం మూడోసారి సైకిల్ యాత్రకు శ్రీకారంచుట్టాడు. ఈ నెల 20న అనంతపురం నుంచి చైనా సరిహద్దుకు సుమారు 12 వేల కిలోమీటర్లు సైకిల్ యాత్ర చేయాలన్న లక్ష్యం నిర్దేశించుకున్నాడు. ఆదివారం అనంతపురం ఉదయం నుంచి ప్రారంభించిన ప్రదీప్ సైకిల్ యాత్ర సాయంత్రానికి కదిరికి చేరుకుంది. అతనికి బ్యాంకు ఉద్యోగి అయిన మేనమామ శ్రీనివాసులు ప్రోత్సాహం అందిస్తున్నారు.



ముదిగుబ్బలో సైకిల్‌పై వెళ్తున్న ప్రదీప్

నేడు అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

కొత్తచెరువు, న్యూస్‌టుడే : జిల్లాలోని కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన పోస్టులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి బుక్కపట్నంలోని సమగ్ర శిక్షా కార్యాలయంలో నిర్వహించే ధ్రువపత్రాల పరిశీలనకు హాజరు కావాలని డీఈఓ మీనాక్షి ఒక ప్రకటనలో కోరారు. మెరిట్ ఆధారంగా జాబితా రూపొందించి.. సంబంధిత అభ్యర్థులకు చరవాణికి సమాచారం అందించామన్నారు. చరవాణికి సమాచారం అందిన అభ్యర్థులు మాత్రమే ధ్రువపత్రాలతో పరిశీలనకు హాజరు కావాలని సూచించారు.



ఎంపికైన అభ్యర్థులతో మంత్రి సత్యకుమార్, జిల్లా ఎస్పీ రత్న, తెదేపా ఇన్‌ఛార్జి శ్రీరామ్

దేశాభివృద్ధిలో మహిళలదే కీలకపాత్ర

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే : దేశాన్ని, కుటుంబాన్ని ముందుకు నడిపించడంలో మహిళలదే కీలకపాత్ర అని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. యువతులు సివిల్స్‌లో ర్యాంకు సాధించేలా తర్ఫీదు ఇప్పిస్తున్నట్లు చెప్పారు. ఆదివారం ధర్మవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దిల్లీకి చెందిన లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ, సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత సివిల్స్ శిక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు 127 మంది డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు హాజరుకాగా, వారందరికీ అర్హత పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షల్లో 28 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరందరినీ లక్ష్మయ్య ఐఏఎస్ అకాడమీ దిల్లీ, హైదరాబాద్ ప్రాంతాల్లో సివిల్స్‌లో రెండేళ్లపాటు ఉచితంగా శిక్షణ ఇస్తారు. శిక్షణ కలెక్టర్ వినూత్న, అభిషేక్ (గోవా కలెక్టర్) అభ్యర్థులకు విలువైన సూచనలిచ్చారు. అనంతరం మంత్రి సత్యకుమార్, జిల్లా ఎస్పీ రత్న, తెదేపా ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ర.భ. శాఖ బంగ్లాల్లో ఉచిత శిక్షణకు ఎంపికైన అభ్యర్థులను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంస్కృతి స్వచ్ఛంద సేవ సంస్థ సేవలను మరింతగా విస్తరించి మరిన్ని సేవలను అందజేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐఏఎస్ అకాడమీ ఛైర్మన్ లక్ష్మయ్య, సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, ప్రతినిధులు రామ్మూర్తి, నరేంద్ర, సోము, కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యార్డుల ఆదాయం పెంపునకు ప్రత్యేక చర్యలు

రాంనగర్ (అనంతపురం): వ్యవసాయ మార్కెట్ యార్డుల ఆదాయం పెంచడమే లక్ష్యంగా మార్కెటింగ్‌శాఖ చర్యలు చేపట్టింది. ఏటా యార్డుల్లో నిర్దేశించిన రుసుం వసూళ్లు తగ్గడమే ప్రధాన కారణం. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఒక్కో జిల్లాకు ఒక్కో విజిలెన్సు కమిటీని నియమించింది. కమిటీలో ఐదుగురు చొప్పున సభ్యులను నియమించింది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు వేర్వేరుగా కమిటీలను నియమించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 17 వ్యవసాయ మార్కెట్ యార్డులున్నాయి. అందులో అనంతపురం జిల్లాలో 9, శ్రీసత్యసాయి జిల్లాలో 8 చొప్పున ఉన్నాయి. వ్యాపారులు కొత్త లైసెన్సులు తీసుకోకపోవడం, పాత లైసెన్సుదారులు బకాయిలు చెల్లించకపోవడం, సంతల్లో ఆదాయం తగ్గడం, రిటర్న్స్ చూపకపోవడం, తదితర వాటిపై కమిటీలు పర్యవేక్షిస్తాయి.

శ్రీసత్యసాయి: జిల్లాలో జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి నరసింహామూర్తి ఆధ్వర్యంలో విజిలెన్సు కమిటీని నియమించారు. సభ్యులుగా కదిరి, మడకశిర, పెనుకొండ కార్యదర్శులు జగదీశ్, నాగేంద్ర, వెంకటేశ్, హిందూపురం యార్డు సూపర్‌వైజర్ కిశోర్‌లను నియమించారు.


అంచనాల తయారీలో అలసత్వం

- ఊసేలేని హంద్రీనీవా విస్తరణ.. లైనింగ్ పనుల ప్రతిపాదనలు
- ప్రభుత్వం ఆదేశించినా స్పందించని జలవనరులశాఖ ఇంజినీర్లు

ఇక్కడ నత్తనడక: ఏప్రిల్ తర్వాత నీటి సీజన్ ముగియగానే హంద్రీనీవా ప్రధాన కాలువ విస్తరణ, లైనింగ్ పనులు మొదలు పెట్టడానికి ఆగమేఘాలపై తగిన 'అంచనా'లను తయారీ చేసి పంపాలంటూ రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి ఉన్నత స్థాయి అధికారుల సమీక్షలో అనంత అధికారులకు నిర్దేశించారు. ఇచ్చిన వారం గడువు తీరిపోయి రెండు వారాలైంది. ఇప్పటికీ అంచనాల తయారీ అతీగతీలేదు.

అక్కడ వేగవంతం: ఇదే హంద్రీనీవా ప్రధాన కాలువకు సంబంధించి సర్కిల్-1 పరిధిలో కర్నూలు జిల్లా ఇంజినీర్లు నిర్దేశిత గడువులోపు అంచనాలను తయారుచేసి ప్రభుత్వానికి పంపించారు. 0-79, 79-144, 143-216 కి.మీ. దాకా మూడు ప్యాకేజీలుగా విభజించి అంచనాలు తయారు చేశారు. కాలువ విస్తరణ కోసం రూ.830 కోట్లు అవుతుందన్న ప్రాథమిక అంచనాలను ప్రభుత్వానికి నివేదించారు.

అనంతపురం(శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: గడిచిన ఐదేళ్లు వైకాపా సర్కార్ జిల్లా నీటి ప్రాజెక్టులను అటకెక్కించింది. నయాపైసా నిధులు ఇవ్వలేదు. దీని మూలంగా ఇంజినీర్లలో నిస్తేజం ఆలుముకుంది. ప్రస్తుత తెదేపా కూటమి ప్రభుత్వం వచ్చిన నాలుగు మాసాల పాలనలో ఉమ్మడి అనంత జిల్లా వరప్రదాయినిగా భావించే హంద్రీనీవా ప్రాజెక్టుకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చేలా దృష్టి సారించింది. హంద్రీనీవా ప్రధాన కాలువ విస్తరణ, లైనింగ్ పనులకు వారం రోజుల్లో తగిన అంచనాలు సిద్ధం చేయాలని ఈనెల 2న రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల సమీక్షలో రాష్ట్ర జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్ స్పష్టంగా ఆదేశించారు. గడువు ముగిసి రెండు వారాలు గడిచినా అతీగతీలేదు.



కృష్ణమ్మ పరవళ్లపై ఆశలు

వరద సీజన్‌లో శ్రీశైలం జలాశయం నుంచి 120 రోజులపాటు కనీసం 40 టీఎంసీలు ఎత్తిపోసేలా హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) ప్రాజెక్టును రూపకల్పన చేశారు. ప్రధాన కాలువ నీటి సామర్థ్యం 3,850 క్యూసెక్కులు. కానీ, గరిష్ఠంగా 2,200 క్యూసెక్కులకు మించి ఎత్తిపోసే పరిస్థితి లేదు. కాలువ పటిష్ఠత, సామర్థ్యం తక్కువ ఉండటమే దీనికి కారణం. దీన్ని గ్రహించిన కూటమి ప్రభుత్వం వచ్చే వేసవిలో తొలి దశ కాలువ వెడల్పు (విస్తరణ), రెండో దశ కాలువను లైనింగ్ చేయాలని నిర్ణయించారు. తద్వారా వచ్చే నీటి సీజన్ నాటికి పనులు పూర్తి చేస్తే.. కృష్ణమ్మ పరవళ్లు తొక్కుకుంటూ అనంత దిశగా పరుగులు తీస్తుందని అన్నదాతలు ఆశలు పెట్టుకున్నారు.

వారంలోపు తయారు చేస్తాం

హంద్రీనీవా ప్రధాన కాలువకు సంబంధించి విస్తరణ, లైనింగ్ పనులపై తగిన అంచనాలు తయారు చేస్తున్నాం. బదిలీలు, చేరికలు.. వంటి పనుల కారణంగా కొంత ఆలస్యమైంది. వచ్చే వారంలో తగిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపిస్తాం.

- నాగరాజు, సీఈ, జిల్లా జలవనరుల శాఖ



రెండో దశ హంద్రీనీవా ప్రధాన కాలువ

నిర్లక్ష్యం వీడేదెప్పుడు?

అనంత జిల్లాలో తొలి దశ ప్రధాన కాలువ 143 కి.మీ. వద్ద మొదలు కానుంది. అక్కడి నుంచి జీడిపల్లి జలాశయం దాకా 216 కి.మీ. వరకు తొలి దశ పూర్తి అవుతుంది. ఈ మధ్య దూరం ఉన్న 73 కిలోమీటర్లు. అనంత, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలో 274 కి.మీ. మేర పొడవు ఉంది. ఈ మేరకు కాలువలో లైనింగ్ చేయాలి. సీమ జిల్లాల పరిధిలో మొత్తం ప్రధాన కాలువ పొడవు 565 కి.మీ. ఉంటే.. ఒక్క ఉమ్మడి అనంత జిల్లాలోనే 347 కి.మీ. మేర ప్రధాన కాలువ ఉండటం విశేషం. ప్రస్తుతం హంద్రీనీవా ప్రాజెక్టు పరిధిలో ఎలాంటి పనులు జరగడం లేదు. అంటే ఇంజినీర్లకు తగిన పనులు లేనట్లే. అయినా.. కాలువ విస్తరణ, లైనింగ్ పనుల అంచనాల తయారీపై అలసత్వం చూపడం జిల్లా తాగు, సాగునీటికే నష్టం. ప్రస్తుతం కాలువ 10 మీటర్ల వెడల్పు ఉంది. దీన్ని 19 మీటర్లకు పెంచుతూ అంచనాలు తయారు చేయాలి.

ఐదేళ్లలో అమరావతిలో తట్టెడు మట్టి వేయలేదు: మంత్రి సవిత

పెనుకొండ, న్యూస్‌టుడే: గత వైకాపా పాలనలో అమరావతి రాజధానిలో జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడా గంపెడు మట్టి వేయలేదని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత విమర్శించారు. ఆదివారం పెనుకొండ మండలంలో పల్లెపండగ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అమరావతి రాజధానిని దేశంలోనే అగ్రస్థానంలో ఉండే విధంగా అభివృద్ధి చేస్తామన్నారు. వైకాపా ప్రభుత్వంలో సర్పంచులకు అధికారం లేకుండా చేయడంతో గ్రామాల అభివృద్ధి కుంటుపడింది. ప్రస్తుతం సర్పంచులకు పూర్తిగా అధికారం ఇచ్చి వారిని గౌరవించింది కూటమి ప్రభుత్వం అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకం ద్వారా రాష్ట్రానికి భారీగా నిధులు కేటాయించి జీవం పోసిందన్నారు. ప్రతి పల్లెలో సీసీ రోడ్లు నిర్మిస్తామని పేర్కొన్నారు.

జిల్లా ప్రైవేటు పాఠశాలల కమిటీ ఏకగ్రీవం



కమిటీని సత్కరిస్తున్న కరస్పాండెంట్లు, తదితరులు

పెనుకొండ,న్యూస్‌టుడే: ప్రైవేటు పాఠశాలల జిల్లా నూతన కమిటీని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.పుల్లారెడ్డి, రాష్ట్ర సలహాదారు నాగ పేరయ్య ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం పెనుకొండ పట్టణ శివారులోని ఎన్‌కన్వెన్‌హాల్‌లో ప్రైవేటు పాఠశాలల జిల్లా అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించి ప్రైవేటు పాఠశాలల సమస్యలపై చర్చించారు. అనంతరం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హిందూపురానికి చెందిన ఎస్.రియాజ్‌బాషా, ఉపాధ్యక్షుడిగా కె.శ్రీనివాసులు, గౌరవ అధ్యక్షుడిగా కొత్తచెరువు ఎస్.శ్రీనివాసులు, కార్యదర్శిగా గోరంట్ల ఎస్.గౌస్‌బాషా, కోశాధికారిగా పెనుకొండకు చెందిన జె.శ్రీకాంత్‌రెడ్డిని ఎన్నుకున్నారు. కమిటీని శాలువ, పూలహారంతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లాలోని 200 ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

భక్తుల హృదయాల్లో కొలువైన సత్యసాయి

ఘనంగా అవతార దినోత్సవం

పుట్టపర్తి, న్యూస్‌టుడే : సత్యసాయి భౌతికంగా మన మధ్య లేకున్నా.. ప్రపంచ మానవాళి హృదయాల్లో కొలువై ఉన్నారని సాయి విద్యా సంస్థల పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. ఆదివారం పుట్టపర్తిలోని సాయికుల్వంత్ మందిరంలో సాయి విద్యా సంస్థల పూర్వ విద్యార్థులు యుజుర్వేద మందిరం నుంచి చిత్రపటాన్ని ఊరేగిస్తూ.. వేదాలు పఠిస్తూ.. పూర్ణకుంభంతో మందిరానికి చేరుకున్నారు. సత్యసాయి అవతార ప్రకటన దినోత్సవాన్ని ప్రారంభించారు. ఉరవకొండలో సత్యనారాయణరాజు 9వ తరగతి విద్యాభ్యాసం చేస్తూ, 14వ ఏటా 1940 అక్టోబరు 20వ తేదీన తనకు తాను సత్యసాయిబాబాగా ప్రకటించిన విషయం విధితమే. మహా సమాధిని వివిధ రంగుల పుష్పాలతో అలంకరించారు. ప్రపంచ మానవాళికి సత్యసాయి అందించిన ప్రేమ, ఆధ్యాత్మిక సందేశం, సేవా మార్గంలో పయాణించాలని.. సత్యసాయి చూపిన బాటలో నడిచి మార్గదర్శకులు కావాలని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. అనంతపురం క్యాంపస్‌కు చెందిన పూర్వ విద్యార్థులు బ్రాస్ బ్యాండ్‌తో సంగీత కచేరి నిర్వహించారు. విద్యార్థులు, భక్తులు సంయుక్తంగా సాయి భక్తి గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. వేలాది మంది భక్తులు సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు.



మంగళవాద్య కచేరి

భవన సముదాయాలు సమకూర్చుకోవాలి

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురం కోర్టు నిర్వహణకు తాత్కాలిక భవన సముదాయాలను త్వరగా సమకూర్చుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ సూచించారు. ఆదివారం జిల్లా అదనపు న్యాయమూర్తి కంపల్లె శైలజ, సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి లలితాలక్ష్మి, సెకెండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ సుకుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌లతో కలిసి ప్రధాన న్యాయమూర్తి స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులతో సమావేశమయ్యారు. కోర్టు ప్రాంగణంలో దెబ్బతిన్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి భవనం, అదనపు జూనియర్ సివిల్‌జడ్జి భవన సముదాయాలను పరిశీలించారు. కోర్టు నిర్వహణకు అనువైన భవనాల ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరగా తీసుకొస్తే రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తిని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీ మహేశ్, సీనియర్ న్యాయవాది రామచంద్రారెడ్డి, ఏపీపీ ఇందాద్, రంగారెడ్డి, సుదర్శన్, సిద్ధు, నాగరాజరెడ్డి సదాశివరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రవీంద్ర, మురళి పాల్గొన్నారు. ★ జిల్లా ప్రధాన న్యాయమూర్తి స్థానిక ఉపకారాగారాన్ని ఆదివారం తనిఖీ చేశారు. విధి నిర్వహణలో గార్డ్ హరినాథ్, నిర్లక్ష్యంగా ఉండటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. జైలు అధికారి అంజినాయక్ ఉదాసీనతపై అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయాలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.



కోర్టుల నిర్వహణకు తాత్కాలిక భవన సముదాయాలను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్, ఏడీజే కె.శైలజ, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

పంట తడుస్తున్నా.. పట్టలేదు

- గత వైకాపా పాలనలో పంపిణీకి తిలోదకాలు
- కూటమి ప్రభుత్వంపై అన్నదాతల ఆశలు



వేరుసెనగ కట్టెపై కప్పిన టార్పాలిన్ పట్టలు

ముదిగుబ్బ, కదిరి, ధర్మవరం, న్యూస్‌టుడే: జిల్లాలో ఐదారు రోజులుగా కురిసిన ఎడతెరిపిలేని వర్షాలతో చేతికొచ్చిన పంట ఉత్పత్తులు నోటికందకుండాపోయాయి. రైతన్నలు ఆరుగాలం శ్రమించి.. ఎన్నో వ్యవప్రయాసలకోర్చి దిగుబడి సాధించినా అవి కాస్తా వర్షార్పణమవుతున్నాయి. రాయితీతో అన్నదాతలకు ఇచ్చే టార్పాలియన్ పట్టల పంపిణీ పథకానికి గత ఐదేళ్ల వైకాపా పాలనలో తిలోదకాలివ్వడం ఫలితంగా నేడు కర్షకులు కష్టాలపాలవుతున్నారు. ప్రభుత్వం మార్కెట్ ధరలో 50 శాతం రాయితీతో ఒక్కో మండలానికి సుమారు 200 నుంచి 250 వరకు టార్పాలిన్ పట్టలు సరఫరా చేస్తుండేది. వైకాపా ప్రభుత్వంలో వాటి పంపిణీని నిలిపేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో మొత్తం 2.20 లక్షల మంది రైతులున్నారు. పంట ఉత్పత్తులను కాపాడుకోలేకపోయారు. మొక్కజొన్న, ఉలవ, ఆముదం వంటి పంటలు కోతకొస్తుండటంతో పంట ఆరబెట్టుకునేందుకు రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

జిల్లాలో సాగైన వివిధ రకాల పంటలు	
పంటరకం	హెక్టార్లు
వేరుసెనగ	62,410
కంది	37,100
మొక్కజొన్న	10,693
వరి	9,164
ఆముదం	5,411
పత్తి	3,548
ఇతర పంటలు	1,791

వర్షాలతో మరింత నష్టం..

ఈనెల 14వ తేదీ నుంచి వర్షాలు ఎడతెరపిలేకుండా కురిశాయి. బోరుబావుల కింద వేరుసెనగ సాగుచేసిన రైతులు 40 శాతం వరకు పంట తొలగించారు. కొందరు రైతులు పొలాల్లోనే నూర్పిడి యంత్రం ద్వారా వేరుసెనగ కాయలు తొలగించగా, మరికొందరు ఒదుళ్లువేసి తోటలోనే ఉంచారు. ఈ క్రమంలో కురిసిన వర్షాలకు తడిసి కాయలు, కట్టె నల్లగా మారాయి. టార్పాలిన్ పట్టాలు లేకపోవడంతో చాలామంది రైతులు

రాయితీలేక.. రైతుపై భారం

గత తెదేపా ప్రభుత్వం హయాంలో నాణ్యమైన టార్పాలిన్ పట్ట ధర రూ.2,400 ఉండేది. రాయితీతో రూ.800లకే రైతులకు అందించారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం రాయితీ పట్టలు పంపిణీ చేయలేదు. ఆ పథకానికి మంగళం పాడేసింది. ప్రస్తుతం మార్కెట్‌లో టార్పాలిన్ నాణ్యత తక్కువగా ఉండేవి రూ.2 వేల నుంచి రూ.2,500 ఉండగా, నాణ్యమైన పట్ట రూ.3 వేలు ధర పలుకుతోంది. నాణ్యమైన పట్ట కొనుగోలు చేయాలంటే రైతు అంత సొమ్ము భారంగా మారింది. ప్రభుత్వం రాయితీపై పంపిణీ చేస్తే రైతుపై భారం తగ్గుతుంది.

ప్రభుత్వం ఆదుకోవాలి

- రామకృష్ణ, తనకంటిపల్లి, అమడగూరు



ఒకటిన్నర ఎకరాలో రూ.50 వేలు ఖర్చుపెట్టి వేరుసెనగ పంటసాగు చేశా. పంట కోతకోసిన వెంటనే ఎడతెరపిలేకుండా వర్షం పడటంతో 80 శాతం పంటంతా తడిసిపోయి కాయలు నల్లగా మారాయి. ప్రభుత్వం రాయితీపై పట్టలు ఇవ్వకపోవడంతో నష్టపోవాల్సి వచ్చింది. ప్రభుత్వం ఆదుకోవాలి.

ఉన్నతాధికారులకు తెలియజేశాం

- సుబ్బారావు, జేడీఏ, శ్రీసత్యసాయి జిల్లా

రైతులకు టార్పాలిన్ పట్టలు అవసరం ఉన్నమాట వాస్తవమే. రాయితీపై పట్టలు అందించాలని రైతులు అడుగుతుండటంతో ఉన్నతాధికారులకు తెలియజేశాం. ఇప్పటి వరకు ఎటువంటి ఆదేశాలు రాలేదు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలొస్తే ప్రతిపాదిస్తాం.

సుబ్రహ్మణ్యేశ్వరుడి కోవెలలో వసతుల కరవు

ఆదాయమున్నా.. నిత్యం సమస్యలేనా?



ఆలయం ముందు నిలిపిన వాహనాలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: భక్తుల కొంగు బంగారం ప్రసిద్ధి చెందిన పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సరైన వసతులు లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రధాన ఆలయాల్లో పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఒకటి. తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటకకు చెందిన భక్తులు స్వామి దర్శనానికి పెద్దఎత్తున వస్తుంటారు. భక్తులకు వసతులు కల్పించడంలో దేవదాయ శాఖాధికారులు విఫలమవుతున్నారు. ప్రధానంగా ఆది, మంగళవారాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. శ్రావణం, మాఘ, కార్తిక మాసాల్లో నెలకు కనీసం 15వేల మందికిపైగా భక్తులు వచ్చి స్వామిని దర్శించుకుంటున్నారు. ఆలయం అభివృద్ధి చెందక ముందున్న రహదారినే నేటికీ వినియోగిస్తున్నారు.

- వారానికి భక్తుల తాకిడి: 6వేల మంది
- ఆలయ ఆదాయం: ఏడాదికి రూ.60 లక్షలు పైగా
- హుండీ లెక్కింపు ఆదాయం: రూ.12 లక్షలు (3 నెలలకోసారి)
- నెలకు వెచ్చించే ఖర్చు: రూ.50 వేలు (పూజారులు, సిబ్బందికి వేతనం)



వాహనాలు వెళ్లే దారిలో వ్యాపారాలు

దాతల సాయంతో

దాతల సాయంతో ఆగిపోయిన రహదారి నిర్మాణ పనులు ప్రారంభించి భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. వాహనాలకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించి పార్కింగ్ వ్యవస్థను నిర్వహించేందుకు వేలం నిర్వహించి నామమాత్రంగా రుసుం వసూలు చేస్తాం. భక్తులకు సౌకర్యాలను మెరుగుపరుస్తాం.

- బాబు, ఆలయ నిర్వహణాధికారి, పంపనూరు

ఆగిన రోడ్డు పనులు

పదేళ్ల కిందట ఆలయంలోకి తక్కువ వాహనాలు వచ్చేవి. నేడు కనీసం 200 వాహనాలు వచ్చి వెళ్తుంటాయి. దూరప్రాంతాల నుంచి వాహనాల్లో వస్తే పార్కింగ్ కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఎక్కడపడితే అక్కడ వాహనాలు ఆపడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దారులు ఇరుకుగా ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు వెళ్లేందుకు వీలులేదు. పెనుకొండకు చెందిన ఓ భక్తుడు లక్షల రూపాయలు ఖర్చు చేసి ప్రధాన రహదారి నుంచి ఆలయం వరకూ రెండంచెల రోడ్డు నిర్మాణానికి పనులు ప్రారంభించాడు. మట్టి రోడ్డు నిర్మాణం పూర్తయిన వెంటనే ఒకచోట స్థలం సమస్య రావడంతో నిర్మాణ పనులు ఆగిపోయాయి. గతంలో అధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి సమస్యకు పరిష్కారం చూపకపోవడంతో దాతలు వెనక్కి వెళ్లిపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాహనాలను ఆలయ ఆవరణంలో పార్కింగ్ చేయకుండా ప్రత్యేక స్థలంలో చేసేలా ఏర్పాటు చేయాల్సి ఉంది.

చెస్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక

హిందూపురం, న్యూస్‌టుడే: హిందూపురంలో ఆదివారం ఆంధ్రా చెస్ అసోసియేషన్, ఆధ్వర్యంలో స్పార్టెన్స్ అకాడమి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెస్ ఓపెన్ అండర్ 13 ఛాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 23 మంది క్రీడాకారులు పాల్గొనగా పలువురు ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా చెస్ కార్యదర్శి నాగార్జున, టోర్నమెంట్ డైరెక్టర్ అరీఫుల్లా తెలిపారు. ఓపెన్ విభాగంలో ప్రథమ స్థానంలో మహాన్‌పెద్దన్న, ద్వితీయ స్థానంలో మిథున్‌పెద్దన్న, బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో జ్ఞాపికారెడ్డి, ద్వితీయ స్థానంలో రుషిత ప్రతిభ కనబరిచినట్లు వివరించారు. వీరిలో టాప్-2 గా నిలిచిన వారు నవంబరు 1 నుంచి 3వ తేదీ వరకు తాడేపల్లిగూడెంలో జరిగే రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు.



జిల్లా స్థాయి ఓపెన్ చెస్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులతో నిర్వాహకులు

కొత్తగా ఆలోచిద్దాం.. నైపుణ్యాలు పంచుకుందాం

యాప్ రూపొందించిన ఉరవకొండ యువకుడు



యాప్‌లో వివరాలు పరిశీలిస్తున్న నూర్

ఉరవకొండ, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలు వెలికితీయాలి. వాటిని అందరూ పంచుకోవాలని ఉరవకొండకు చెందిన నూర్ అనే యువకుడు సరికొత్తగా ఆలోచించారు. క్లాస్ ప్లస్ వారి సహకారంతో 'టైగర్ టెస్ట్ అకాడమీ యాప్' రూపొందించారు. అందులో ప్రత్యేక దినోత్సవాలు, చేతిరాత, చిత్రలేఖనం, వ్యాసరచన, మొక్కల పెంపకం, స్నేహితులతో ఆడుకోవడం, ఆన్‌లైన్ పరీక్షలు రాయడం, వివిధ పాఠ్యాంశాల్లో ప్రాజెక్టులను తయారు చేయడం వంటి పూర్తి సమాచారాన్ని (స్టడీ మెటీరియల్) నమోదు చేశారు. విద్యార్థులు వాటిని చదువుకుని తమకు ఆసక్తి ఉన్న అంశంపై ఇంటి వద్ద నుంచే పోటీలో పాల్గొనవచ్చు. ఉదాహరణకు.. చిత్రలేఖనంలో ఆసక్తి ఉంటే చిత్రం గీసి, ఆ ఫొటోను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. వ్యాసరచన అయితే నచ్చిన అంశాన్ని రాసి అప్‌లోడ్ చేయాలి. విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న ఏ అంశంలోనైనా నైపుణ్యాన్ని పంచుకోవచ్చు. వాటిని పరిశీలించి ప్రతిభ చూపిన వారికి ప్రశంసా పత్రాలు పంపుతారు.

1,113 మంది విద్యార్థులు..

టైగర్ టెస్ట్ అకాడమీ యాప్‌ను ప్లేస్టోర్‌లో ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అందులో విద్యార్థి పేరు నమోదు చేయాలి. యాప్‌లో చాట్స్‌పై క్లిక్ చేసి పోటీకి సంబంధించిన ఫొటోలను అప్‌లోడ్ చేయాలి. ఇప్పటి వరకు వివిధ ప్రాంతాలకు చెందిన 1,113 మంది విద్యార్థులు తమ నైపుణ్యాన్ని పంచుకున్నారు. ఈ యాప్ ద్వారా పాఠ్యాంశాలతో పాటు వివిధ పోటీలకు సంబంధించిన అంశాలను ఫ్లెక్సీ డిజైన్ ద్వారా అందుబాటులోకి తేవాలని నూర్ ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే కొన్ని రూపొందించారు. చాలా డిజైన్‌లు తయారు చేయాలన్నది అతని లక్ష్యం. అందుకు ఎక్కువ సమయం, ఖర్చు అవుతుంది. దాతలు ప్రోత్సహిస్తే ఆ దిశగా ప్రయత్నిస్తానని చెబుతున్నారు.

అభివృద్ధికి అడ్డుపడితే తరిమికొడతాం: సునీత

రాంనగర్, న్యూస్‌టుడే: అభివృద్ధికి కలిసి వస్తే కలుపుకొని పోతాం.. అడ్డు తగిలితే ఊరుకునే ప్రసక్తే లేదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత హెచ్చరించారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం అనంతపురం గ్రామీణం ఆలమూరులో అభివృద్ధి పనులకు భూమిపూజ చేసి ప్రారంభించారు. అనంతరం గ్రామసభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైకాపా హయాంలో అడుగు రోడ్డు కూడా వేయలేదన్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి మాటలు కోటలు దాటుతున్నాయన్నారు. గ్రామాల్లో అభివృద్ధి చేయాలని ఇంకెవరు చేస్తే కమీషన్ల కోసం అడ్డుపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో అర్హత ఉన్నవారికి పింఛన్లు ఇవ్వకుండా దర్జాగా కార్లు, పెద్ద పెద్ద బంగ్లాల్లో ఉన్న వారికి వైకాపా ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేసి పందారని ఆరోపించారు. అనర్హులను ఏరివేసి అర్హులందరికీ కూటమి ప్రభుత్వం పింఛన్లు ఇస్తామన్నారు. అలమూరులో రూ.20 లక్షలతో సీసీ రహదారి పనులు ప్రారంభించామని ఆమె తెలిపారు.



సీసీ రహదారి పనులు ప్రారంభిస్తున్న సునీత

23న ఎరువులు, విత్తన డీలర్ల కార్యవర్గం ఎన్నిక

రాంనగర్ (అనంతపురం) న్యూస్‌టుడే : ఈ నెల 23న ఎరువులు, పురుగు మందులు, విత్తన డీలర్ల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సురేశ్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర నాయకులు ఆధ్వర్యంలోనే డీలర్ల సమస్యలు చర్చించడంతో పాటు నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సమావేశానికి ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఎరువులు, పురుగు మందులు, విత్తన డీలర్లంతా హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కేజీబీవీ ఉద్యోగాల తాత్కాలిక జాబితా విడుదల

ఎస్కేయూ, న్యూస్‌టుడే: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన ఉద్యోగాలకు అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాలు ఇటీవల పరిశీలించారు. వాటికి సంబంధించిన తాత్కాలిక మెరిట్ జాబితా ఆదివారం విడుదల చేశారు. ఈ జాబితా సమగ్రశిక్ష ఏటీపీ. బ్లాగ్‌స్పాట్.కాం వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. ఈ జాబితాపై అభ్యంతరాలుంటే ఈ నెల 21న సాయంత్రం 4 గంటలలోపు సమగ్రశిక్షా కార్యాలయంలో తెలియజేవచ్చని ఏపీసీ నాగరాజు తెలిపారు.

నేటి నుంచి అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల వారోత్సవాలు ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్నాయి. పోలీసు సేవలను కొనియాడుతూ ఈ వారోత్సవాలను ఘనంగా నిర్వహించేలా జిల్లా పోలీసుశాఖ సిద్ధమైంది. ఎస్పీ జగదీశ్ పర్యవేక్షణలో ఈ నెల 21 నుంచి 31 వరకు జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో వారోత్సవాలు నిర్వహించనున్నారు. విధి నిర్వహణలో అసువులు బాసిన అమర పోలీసుల్ని గుర్తు చేసుకోవడం, సమాజంలో పోలీసుల పాత్ర, విధులు, త్యాగాల గురించి ప్రజల్లో అవగాహన తీసుకురావడమే వారోత్సవాల ఉద్దేశ్యం. అనంతపురం జిల్లాలో గత అక్టోబరు 21 నుంచి ఈ నెల 21 వరకు 12 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. ఈ నెల 21న స్మృతి కవాతు, అమరులకు నివాళి, 22న అమరవీరుల గ్రామాల సందర్శన, సేవలను వివరించడం, 24 నుంచి 27 వరకు చర్చావేదికలు, వ్యాసరచన పోటీలు, 26న పోలీసుల త్యాగాలు, పరాక్రమాలు తెలియజేసే చిత్రాల ప్రదర్శన, 26 నుంచి 27 వరకు వివిధ ఆయుధాల ప్రదర్శన, 28న వైద్యశిబిరాలు, రక్తదాన శిబిరాలు, 28 నుంచి 30 వరకు పోలీసు వాద్య బృందాల ప్రదర్శనలు నిర్వహిస్తారు.



జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని అమరవీరుల స్మారక చిహ్నం

అమర వీరులు వీరే: హెచ్. గోవిందప్ప (రాప్తాడు), బి.సురేశ్ (కళ్యాణదుర్గం టౌన్), డి.శ్రీరామ్ నాయక్ (జిల్లా ఏఆర్), ఎన్.సుంకన్న (పీసీఆర్, ఏటీపీ), డి.రాజశేఖర్ (ఏఆర్), డి.హాజీపీరా (ఏఆర్), వి.శ్రీనివాసులు (అనంతపురం త్రీటౌన్), వి.నాగప్ప, సి.చెన్నప్ప, ఎన్.ఆంజనేయులు.

ఊడుతున్న పెచ్చులు

కంగారుగా విధులు



పెచ్చులూడిన పైకప్పు



బాత్‌రూంలో వర్షపు నీరు

అనంతపురం వ్యవసాయ అసిస్టెంట్ డివిజన్ సొంత భవనం లేదు. జిల్లా ఎరువులు, పురుగు మందుల పరీక్ష కేంద్రంలోని పాత భవనంలో కార్యాలయం నిర్వహిస్తున్నారు. వర్షాలతో పాతబడిన ప్రభుత్వ కార్యాలయాలు కారుతున్నాయి. ఏడీఏ ఛాంబర్ పీవోటీ అంతా చెమ్మ దిగింది. వరండాలోని పైకప్పు నిత్యం తడిసి పెచ్చులూడి కిందపడుతున్నాయి. ఉద్యోగులు, సిబ్బందంతా భయాందోళన చెందుతున్నారు. బాత్‌రూం పైకప్పులో పెచ్చులుండటంతో కాలకృత్యాలు తీర్చుకునేందుకు భయంగా వెళ్లాల్సి వస్తోందని ఉద్యోగులు వాపోతున్నారు.

- న్యూస్‌టుడే, రాంనగర్ (అనంతపురం)

సాగునీటికి నిధులు కేటాయించాలి

సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా

ఆజాద్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: జిల్లాలో ఉన్న సాగునీటి ప్రాజెక్టులకు ప్రవేశ పెట్టబోయే బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై నేడు (సోమవారం) కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ ధర్నాకు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే ఎం.ఎ.గఫూర్ హాజరవుతారని వెల్లడించారు. ఆదివారం ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాంభూపాల్ మాట్లాడారు. ఈ నెల 15 నుంచి 19వరకు ఐదు రోజులపాటు సాగునీటి ప్రాజెక్టులను బస్సు యాత్ర ద్వారా సీపీఎం పార్టీ బృందం పరిశీలించిందన్నారు. బీటీపీ, మిడ్‌పెన్నార్, జీడిపల్లి, సుబ్బరాయసాగర్‌లు కనీస నిర్వహణకు నోచుకోలేదన్నారు. తమ బృందం 803 కిలోమీటర్లు 24 మండలాల్లో పర్యటించామన్నారు. నాయకులు నల్లప్ప, నాగేంద్రకుమార్, సావిత్రి, కృష్ణమూర్తి, చంద్రశేఖర్‌రెడ్డి, పాల్గొన్నారు.

సంతల ఆదాయం రూ.4.22 లక్షలు

రాంనగర్ (అనంతపురం) న్యూస్‌టుడే : అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని వారం సంతల్లో ఆదాయం మళ్లీ పుంజుకుంది. గత వారం సంతల్లో దసరా పండుగతో ఆదాయం తగ్గింది. ఈ వారం మళ్లీ పెరిగింది. గత వారం మొత్తం రూ.3,45,200 ఆదాయం వచ్చింది. ఈ వారం మొత్తం రూ.4,22,740కు పెరిగింది. అందులో గొర్రెలు, మేకల సంతలో రూ.2,23,550 ఆదాయం రాగా, పశువుల సంతలో రూ.1,99,190 ఆదాయం వచ్చిందని యార్డు ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు.

సీజీ ప్రాజెక్టు నుంచి దిగువకు నీరు

తనకల్లు, న్యూస్‌టుడే : ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాల కారణంగా చెన్నరాయస్వామి గుడి (సీజీ) ప్రాజెక్టు నిండినందున ఆదివారం రాత్రి గేట్లు ఎత్తినట్లు అధికారులు తెలిపారు. సీజీ ప్రాజెక్టు పరిసర గ్రామాల వాసులు, పాపాఘ్నినది పరివాహక ప్రాంత ప్రజలు, టి.సదుం గ్రామ ప్రజలు ప్రాజెక్టు వైపునకు వెళ్లొద్దని సూచించారు. గేట్లు ఎత్తుతున్నందున ఆ ప్రాంత ప్రజలను నీటిపారుదల శాఖ అధికారులు అప్రమత్తం చేశారు. ఒక గేటును ఎత్తి అడుగుమేర నీటిని దిగువకు వదులుతున్నట్లు తెలిపారు. ఇన్‌ఫ్లోను బట్టి నీటిని విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఎర్రనేల కొట్టాలలో మహిళ హత్య

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం నగరంలో మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధి ఎర్రనేల కొట్టాలలో ఒంటరి మహిళను గుర్తుతెలియని దుండగులు హత్య చేశారు. శెట్టూరు మండలం కరిడిపల్లికి చెందిన నాగమ్మ(52) ఎర్రనేల కొట్టాలలో రామకృష్ణకు చెందిన ఇంట్లో పై అంతస్తులో ఓ గదిలో నివశిస్తోంది. ఈమె సైపుల్లా వంతెన సమీపాన లక్ష్మీ ఇడ్లీ సెంటర్‌లో పనిచేస్తోంది. ఉదయం ఐదున్నర గంటలకు హోటల్‌కు వెళ్లి, తిరిగి మధ్యాహ్నం పన్నెండు గంటలకు గదికి వచ్చేది. ఆదివారం ఎంత సేపటికీ రాకపోవడంతో.. హోటల్ యజమాని సురేంద్రబాబు ఇంటి యజమానికి ఫోన్ చేశాడు. ఆయన మేడపైకి వెళ్లి తలుపులు మూసి ఉండటం గమనించారు. పిలిచినా పలకకపోవడంతో తలుపులు తెరిచి చూడగా నాగమ్మ మంచంపై నిర్జీవంగా పడి ఉండటం చూసి త్రీటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం ముఖంపైన, మంచంపైన పలుచోట్ల కారంపొడి చల్లిన ఆనవాళ్లు ఉన్నాయి. ఎస్పీ జగదీశ్, అర్బన్ డీఎస్పీ శ్రీనివాసరావు, త్రీటౌన్ సీఐ శాంతిలాల్, ఫోర్త్ టౌన్ సీఐ సాయినాథ్‌లతో కలిసి ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ఇంటి యజమానిని పలు వివరాలు ఆరా తీశారు. జాగిలంతో పరిసరాలను పరిశీలించి, క్లూస్ టీంతో ఆధారాలను సేకరించారు. కేసు నమోదు అనంతరం మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గొంతు నులిమి ఊపిరి ఆడకుండా చేయడం వల్లే మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. ప్రత్యేక బలగాలతో గాలింపు చర్యలు చేపడుతున్నారు.



స్థానికులతో వివరాలు ఆరా తీస్తున్న ఎస్పీ జగదీశ్



నాగమ్మ

- మృతురాలిది కళ్యాణదుర్గం మండలం ఉప్పొంక గ్రామం. శెట్టూరు మండల కరిడిపల్లికి చెందిన నాగప్పతో వివాహమైంది. వీరి కుమారులు వీరేశ్, సందీప్ కుమార్తె మల్లమ్మ ఉన్నారు. భర్త మూడేళ్ల క్రితం మృతి చెందాడు. నాగమ్మ ఇరవై ఏళ్ల క్రితం భర్త నుంచి విడిపోయింది. పదేళ్ల క్రితం అనంతపురానికి వచ్చింది. ఎర్రనేల కొట్టాలలో ఉంటూ హోటళ్లలో పనిచేస్తూ ఒంటరిగా ఉండేది.

తనయుడి చేతిలో తండ్రి హతం

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: రాయదుర్గం పట్టణంలోని సిద్దేశ్వర కాలనీకి చెందిన బొమ్మన్న(51)ను కన్న కుమారుడు దారుణంగా హత్య చేశాడు. తన తండ్రి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడని అందరిని నమ్మించే ప్రయత్నం చేశాడు. పోలీసుల విచారణలో అసలు విషయం బయటపడటంతో కటకటాల పాలయ్యాడు. పోలీసులు, బంధువుల వివరాల మేరకు.. బొమ్మన్న, శివమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ కలహాలతో తండ్రి, కుమారుడు నాగరాజు తరచూ గొడవ పడేవారు. కోడలు ఆశా ప్రవర్తన సరిగా లేదని ఆయన మందలించారు. దాంతో శనివారం ఉదయం తండ్రి, కుమారుడు ఇద్దరూ ఇంట్లో ఘర్షణ పడ్డారు. ఆ తర్వాత బొమ్మన్న సరిహద్దులో ఉన్న కర్ణాటక రాష్ట్రం పెదార గుడ్డం గ్రామంలోని వ్యవసాయ తోటకు వెళ్లారు. సాయంత్రం ద్విచక్ర వాహనంలో తన బంధువు సురేష్‌తో కలిసి వస్తుండగా, మల్లాపురం తండా సమీపంలోని మెచ్చిరి రోడ్డులో కుమారుడు నాగరాజు తన స్నేహితుడు పబ్జీతో కలిసి స్కూటీలో ఎదురుపడ్డారు. అక్కడ ఇద్దరూ గొడవ పడ్డారు. కుమారుడు వెంట తెచ్చుకున్న కొడవలితో తండ్రిని నరికాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో రాయదుర్గం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లాడు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. తన తండ్రి రోడ్డు ప్రమాదంలో గాయపడినట్లు చెప్పాడు. అయితే నాగరాజు బళ్లారిలో ఉన్న తన చెల్లి శైలజకు వాట్సాప్ కాల్ చేసి తండ్రిని చంపుతానని చెప్పాడని, ఆమె వద్దని వారించినా వినకుండా ఈ దురాగతానికి పాల్పడ్డాడని కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపించారు. పోలీసులు నాగరాజుతోపాటు అతని స్నేహితుడు పబ్జీని అదుపులోకి తీసుకొని విచారించగా, నేరం అంగీకరించాడు. తల్లి ఫిర్యాదు మేరకు సీఐ జయనాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



బొమ్మన్న

ఆనందం.. అంతలోనే విషాదం

- బస్సు, ద్విచక్రవాహనం ఢీ.. ఇద్దరి దుర్మరణం
- కేశఖండనకు వెళ్లి వస్తుండగా ఘటన

తాడిపత్రి, న్యూస్‌టుడే : యాడికిలోని రాఘవేంద్ర కాలనీకి చెందిన చరణ్‌రాజ్ కుటుంబం, అదే కాలనీలో ఉన్న అతని సోదరి సుమిత్ర, బావ రాముడు కారు, ద్విచక్రవాహనంపై బంధువుల్లో ఓ బాలుడి కేశఖండన మహోత్సవానికి ఆదివారం నార్పల మండలం మద్దలపల్లికి బయలుదేరి వెళ్లారు. చరణ్‌రాజ్ కార్యక్రమాన్ని ముగించుకొని అతని భార్య మనీషా ద్విచక్రవాహనం, అతని సోదరి కుటుంబం, తల్లిదండ్రులు కారులో తిరుగు ప్రయాణమయ్యారు. తాడిపత్రిలోకి రాగానే సుమిత్ర దంపతుల కుమారుడు లక్ష్మీరామ్ మామ చరణ్‌రాజ్ ద్విచక్రవాహనంలో వెళ్తానని మొండికేయడంతో ఎక్కించారు. అక్కడి నుంచి యాడికి బయలుదేరగా చుక్కలూరు గ్రామం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనింది. ఈ ఘటనలో చరణ్‌రాజ్(30), లక్ష్మీరామ్(9) అక్కడికక్కడే మృతి చెందగా మనీషాకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం అనంతపురం పెద్దాసుపత్రికి తీసుకెళ్లారు. చరణ్‌రాజ్ స్వగ్రామం నంద్యాల జిల్లా కోవెలకుంట్ల మండలం బిజినవేముల కాగా ఐదేళ్ల కిందట యాడికిలో స్థిరపడ్డారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు.



చరణ్‌రాజ్



లక్ష్మీరామ్

> అప్పటి వరకు సంబరంగా గడిపిన ఆ కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. అనుకోని విధంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కుటుంబాల్లో ఇద్దరు మృత్యువాత పడ్డారు. బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి హాజరైన ఆనందం అంతలోనే ఆవిరైపోయింది. మృతుల్లో ఒకరు తొమ్మిదేళ్ల బాలుడు ఉండటం అందర్నీ కలచి వేసింది. మాటలతో అందర్నీ మురిపించే కుమారుడు ఇక రాడని తెలిసి కన్నోళ్లు రోదించిన తీరు వర్ణనాతీతం. ఇదే ప్రమాదంలో గాయపడిన బాలుడి తల్లి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో కొట్టుమిట్టాడుతోంది.



నూనె మిల్లులో అగ్నిప్రమాదం


రాప్తాడు: రాప్తాడు మండలం మైనార్టీ కాలనీ పరిధిలోని శ్రీగణేష్ ట్రేడర్స్ గోడౌన్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. బుక్కపట్నం మండలం కృష్ణాపురానికి చెందిన మాధవనాయుడు శిల్పా లేపాక్షినగర్‌లో నివాసం ఉంటున్నారు. ఇతనికి చెందిన ఆయిల్ మిల్లులో ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో మిల్లు నుంచి పొగలు రావడం గమనించిన స్థానికులు అగ్నిమాపక కేంద్రం వారికి తెలిపారు. మిల్లులో ఆయిల్, వేరుసెనగ ప్యాకెట్లు, చెక్క, మిషనరీ పూర్తిగా కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చినా అప్పటికే నష్టం జరిగిపోయింది. అనంతపురం జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసరెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వర్లు పరిశీలించారు. బాధితుడు మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదంతో తీవ్రంగా నష్టపోయామని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పిడుగు పడి రైతు, ఆవు మృతి

హిందూపురం: హిందూపురం గ్రామీణ మండలం పోచనపల్లిలో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి పోచనపల్లికి చెందిన లక్ష్మయ్య(65)తోపాటు పాడి ఆవు మృతిచెందింది. ఆదివారం ఉదయం లక్ష్మయ్య పాడి ఆవును మేతకు తీసుకెళ్లాడు. సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చే సమయంలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురవడంతో వెంటనే సమీపంలోని చెట్టు వద్దకు వెళ్లగా అక్కడ పిడుగుపడింది. రాత్రయినా రైతు ఇంటికి రాకపోవటంతో కుటుంబ సభ్యులు వెళ్లి పరిశీలించగా ఈ ఘటన వెలుగుచూసింది. హిందూపురం పరిసర ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురవటంతో పొలాల్లో మొక్కజొన్న, మిరప పంట దెబ్బతిన్నాయి. హిందూపురం గ్రామీణ మండలం సవనపల్లి చెరువు మరువ నీరు హిందూపురం - తూముకుంట రహదారిపై పెద్దఎత్తున ప్రవహించటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి దాదాపు కిలోమీటరు వరకు వాహనాలు నిలిచాయి.

చేపలవేటకు వెళ్లి మృత్యువాత

కదిరి పట్టణం, న్యూస్‌టుడే : కదిరి మండలం ముత్యాలచెరువుకు చెందిన బయ్యప్ప (54) చేపలవేటకు వెళ్లి మృత్యువాత పడ్డారు. గ్రామస్థులు, బాధితుని కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు వివరాలు. ముత్యాలచెరువు వద్ద హిందూపురం రోడ్డులో టీ దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్న బయ్యప్ప శనివారం రాత్రి గ్రామానికి సమీపంలోని కానుగలకుంటలో చేపల పట్టేందుకు వెళ్లారు. ఆదివారం ఉదయం వరకూ ఇంటికి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు కుంట వద్దకు వెళ్లగా అతను మృతి చెంది ఉండటాన్ని గుర్తించారు. వల విసిరే సమయంలో నీటిలో మునిగి మృతి చెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. అతనికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అప్‌గ్రేడ్ సీఐ మోహన్ తెలిపారు.



బయ్యప్ప

హిందూపురం

• హిందూపురం • పెనుకొండ • మడకశిర

పదేళ్లకు నీటి ట్యాంకు శుభ్రం


పిచ్చిమొక్కలను తొలగిస్తున్న గ్రామ జనసేన, తెదేపా నాయకులు, కార్యకర్తలు

సోమందేపల్లి, న్యూస్‌టుడే: మంచేపల్లిలో పదేళ్లకుపైగా నిరుపయోగంగా ఉండి.. తీగలు, పిచ్చిమొక్కలతో అధ్వానంగా మారిన నీటి ట్యాంకు ఆదివారం గ్రామ జనసేన, తెదేపా యువ నాయకులు, కార్యకర్తల చొరవతో ఎట్టకేలకు పరిశుభ్రంగా తయారైంది. నాయకులు రహంతుల్లా, ఎఫ్ఏ గంగాధర్, కార్యకర్తలు నితిన్ కుమార్, సుహేల్ బాషా కలిసి శుభ్రం చేశారు.

◆ పురపాలక సంఘం: హిందూపురం ◆ ప్రాంతం: ముద్దిరెడ్డిపల్లి ◆ కాలనీలు: ఆరు ◆ నివాసగృహాలు: 4,890 ◆ జనాభా: 19,930 మంది

ఖాళీ స్థలాలు.. అపరిశుభ్రతకు నిలయాలు

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: హిందూపురం పురపాలక సంఘం పరిధిలోని ముద్దిరెడ్డిపల్లిలో అధికశాతం నివాసగృహాలు, సిల్క్ వ్యాపార దుకాణాలు నిర్మించుకోవాలని స్థలాలను ఖాళీగా ఉంచారు. వీటి నిర్వహణలో భద్రత లేక పోవడంతో అపరిశుభ్రత నిలయాలుగా మారుతున్నాయి. ఈ కారణంగా దుర్వాసన, దోమల ప్రభావం ఎక్కువై తరచూ అనారోగ్యాలకు గురవుతున్నామని పరిసర వాసులు వాపోతున్నారు. చెత్తకుండీలు లేకపోవడంతో ఎలాపడితే అలా చెత్త విసిరేయడం, వర్షాకాలంలో నీరు నిల్వ ఉండటంతో అవస్థలు ఏర్పడుతున్నాయి. ఇలా ఖాళీగా ఉన్న వాటికి చుట్టూ ప్రహరీ నిర్మించి, పెరిగిన చెట్లు, మొక్కలను తొలగించి రక్షణ కల్పించుకొని శుభ్రంగా ఉంచుకోవాలని సంబంధిత స్థలాల యజమానులకు గతంలో మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చినా అది ఆచరణ రూపం దాల్చక పోవడంతో పరిస్థితి దారుణంగా తయారైంది.


ముద్దిరెడ్డిపల్లిలో ఖాళీ స్థలంలో నిలిచిన నీరు


ముద్దిరెడ్డిపల్లిలో పడేసిన చెత్తాచెదారం

పరిశీలించి చర్యలు చేపడతాం

ఖాళీ ఇంటి స్థలాలను పరిశీలించి వాస్తవ పరిస్థితులను తెలుసుకొని చర్యలు చేపడతాం. వాటిలో ఉన్న అసౌకర్యాలను తొలగించేలా స్థల యజమానులు, కౌన్సిలర్లతో చర్చించి సమస్యను చక్కదిద్దేలా చూస్తాం. వెంటనే పారిశుద్ధ్య సిబ్బందిని అప్రమత్తం చేసి పరిసరాల్లో శుభ్రత కల్పించేలా దృష్టి సారిస్తాం. **-సంగం శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్**

ఎన్టీఆర్ గృహాలకు మహర్దశ

☛ త్వరలో లబ్ధిదారులకు బిల్లులు ☛ కూటమి ప్రభుత్వ నిర్ణయంతో సర్వత్రా హర్షాతిరేకాలు

లేపాక్షి, హిందూపురం, చిలమత్తూరు, న్యూస్‌టుడే: పేదల సొంతింటి కలలను నెరవేర్చేందుకు 2016-19లో గత తెదేపా ప్రభుత్వం పక్కా గృహాలను మంజూరు చేసింది. నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు బిల్లులు చెల్లించింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోవడంతో ఎన్టీఆర్ పక్కా ఇళ్ల బిల్లులు ఆగిపోయాయి. అప్పులు చేసి నిర్మాణాలు చేపట్టిన వారు దిక్కుతోచని పరిస్థితిలో ఉండిపోయారు. వైకాపా హయాంలో మంజూరైన ఇళ్లకు కూడా ఇప్పటికీ పూర్తిస్థాయిలో బిల్లులు ఇవ్వలేదు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పేదల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఎన్టీఆర్, జగనన్న పక్కా ఇళ్లకు బిల్లులు మంజూరు చేయాలని నిర్ణయించడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మండలం	ఎన్ఎస్	బీబీఎల్	బీఎల్	ఆర్ఎల్	ఆర్సీ	పూర్తయినవి
లేపాక్షి	105	48	198	75	526	289
హిందూపురం	126	80	198	40	573	329
చిలమత్తూరు	39	58	159	106	694	262

క్షేత్రస్థాయిలో నిర్మాణాల పరిశీలన

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్టీఆర్ గృహాలపై ఇప్పటికే సర్వే పూర్తి చేశాం. లబ్ధిదారులకు నిర్మాణాలు, బిల్లుల మంజూరుపై అవగాహన కల్పిస్తున్నాం. నిర్మాణాలు త్వరగా చేపడితే బిల్లులు మంజూరవుతాయి. క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలించి యాప్‌లో నమోదు చేస్తున్నాం. **- శ్రీనివాసులు, డీఈ, గృహనిర్మాణశాఖ, హిందూపురం**

నియోజకవర్గ వ్యాప్తంగా ఇలా...

నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్ఎస్(నాట్ స్టార్టెడ్), బీబీఎల్(పునాదుల కోసం తవ్విన గుంతలు), బీఎల్(పునాదులు), ఆర్ఎల్(గోడల స్థాయి) ఆర్సీ(పైకప్పు), వివిధ దశల్లో 3905 పక్కా ఇళ్లు ఉన్నాయి. వీటిలో బీబీఎల్ స్థాయిలో 186, బీఎల్ స్థాయిలో 555, ఆర్ఎల్‌లో 221, పూర్తయిన ఇళ్లు 880 ఉన్నాయి. గతంలో ఎన్టీఆర్ ఇంటి నిర్మాణానికి రూ.1.50లక్షలు కేటాయించారు. దానిని పెంచి ప్రస్తుతం రూ.1.80లక్షలు ఇవ్వనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.


ఎన్టీఆర్ గృహ లబ్ధిదారులతో అధికారులు

అప్పులు చేసి నిర్మించుకున్నాం



2016లో ఎన్టీఆర్ ఇళ్లు మంజూరు అయింది. మొదట్లో సంతోషంగా ఉండేది. వైకాపా వచ్చిన తరువాత పట్టించుకోలేదు. అప్పులు చేసి కొంత వరకు ఇంటి నిర్మాణం చేపట్టాం. ఇప్పుడు తెదేపా అధికారంలోకి వచ్చి బిల్లులు మంజూరు చేస్తామని చెప్పడం ఆనందంగా ఉంది. బిల్లు వస్తే నిర్మాణం పూర్తి చేసుకుంటాం. **-సజ్జమ్మ, కోడిపల్లి, లేపాక్షి**

ఏళ్లు గడిచినా మట్టిరోడ్లే శరణ్యం

బాలాజీనగర్ వాసుల ఆవేదన

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: హిందూపురం పురపాలక సంఘం పరిధిలో బాలాజీనగర్ ఏర్పడి పదేళ్లు దాటింది. ఇక్కడ గతంలో వచ్చిన అరకొర నిధులతో కాలనీలో కొన్నిచోట్ల సిమెంటు రోడ్లు నిర్మించారు. ఆ తర్వాత నిధులు మంజూరు కాకపోవడంతో ఇంకా చాలా చోట్ల సిమెంటు రోడ్లు లేవు. ఏళ్లు గడిచినా మట్టిరోడ్లే మాకు దిక్కని కాలనీవాసులు వాపోతున్నారు. వర్షాకాలంలో ఈ రోడ్లు బురదమయంగా తయారై వాహనాల రాకపోకలకే కాదు కనీసం పాదచారులు సైతం సజావుగా నడవలేని దుస్థితి. ఆపై దుర్వాసన పేరుకుపోయి దోమలు, పందుల సంచారానికి నిలయాలుగా మారుతున్నాయి. తరచూ పరిసర ప్రాంతాల్లోని నివాసితులు అనారోగ్యాలకు గురవుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు మాట్లాడుతూ పరిశీలించి తాత్కాలిక చర్యలు తీసుకొని మట్టిరోడ్లను బాగుచేస్తామన్నారు. సిమెంటు రోడ్ల నిర్మాణం కోసం నిధులు కావాలని ప్రతిపాదనలు పంపుతామన్నారు.


బాలాజీనగర్‌లో మట్టిరోడ్డు ఇలా..

చంద్రబాబు పాలనలో పల్లెలకు పూర్వ వైభవం :మంత్రి

పెనుకొండ,న్యూస్‌టుడే: రాష్ట్రంలో సీఎం చంద్రబాబు పాలనతోనే పల్లెలకు పూర్వవైభవం వచ్చిందని, గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. ఆదివారం మండలంలోని మరువపల్లిలో మంత్రి సవితకు గజమాలతో ఘనస్వాగతం పలికారు. మరువపల్లి, బాపనకాలువ గ్రామాల్లో పల్లెపండగ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. శెట్టిపల్లి పంచాయతీలోని బాపనకాలువలో రూ.30లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ఐదేళ్ల వైకాపా పాలనలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచి అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా పల్లెపండగలు జరపుకోవడం గర్వంగా ఉందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన 125రోజుల్లోనే పెనుకొండ నియోజకవర్గంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రూ.27 కోట్లతో 323 పనులు, పెనుకొండ మండలంలో రూ.4.15కోట్లతో 40పనులు ప్రారంభించామన్నారు. రాంపురం గ్రామపంచాయతీ పరిధిలోని మరువపల్లిలో 2ఓ.హెచ్ఎస్ఆర్ ట్యాంకులు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ వెంకటరమణ, ఎంపీడీవో నరేశ్‌కృష్ణ, ఏపీవో జయమ్మ, రాంపురం సర్పంచిశ్రీనివాసులు, తెదేపా మండల కన్వీనర్‌సిద్దయ్య, స్థానిక నాయకులు కార్యకర్తలు తదితరుల పాల్గొన్నారు.


బాపనకాలువ వద్ద రోడ్డు ప్రారంభిస్తున్న మంత్రి సవిత

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

హిందూపురం: 80085 73018, పెనుకొండ: 91000 20922, మడకశిర: 76759 19016

సమస్య: సోమిరెడ్డిపల్లిలో మురుగు రహదారిపైకి వస్తోంది. **- రంగనాథ్**
సమాధానం: వెంటనే శుభ్రం చేయిస్తాం. **- ఆదినారాయణ, సర్పంచి, లేపాక్షి.**
సమస్య: గౌరిగానిపల్లిలో వీధి దీపాలు వెలగడం లేదు. **- సావిత్రమ్మ**
సమాధానం: కొత్తవి ఏర్పాటు చేయిస్తాం. **- నిర్మలమ్మ, సర్పంచి, మానేపల్లి.** –న్యూస్‌టుడే, లేపాక్షి

సమస్య : సుద్దకుంటపల్లి పాఠశాల ముందున్న చింతచెట్ల మీదుగా విద్యుత్తు తీగలు వెళ్లాయి. వర్షాలకు ప్రమాదకరంగా మారాయి. **-భాగ్యమ్మ**
సమాధానం: పరిశీలించి చర్యలు చేపడతాం. **-పరమేశ్వర్‌రెడ్డి, ఏఈ,**
–న్యూస్‌టుడే, సోమందేపల్లి

సమస్య: గౌడనకుంట ఇందిరిమ్మ కాలనీలో అంగన్‌వాడీకి వెళ్లే రోడ్డు బురదమయమైంది. సీసీ రోడ్డు నిర్మించాలి. **-జయరామప్ప.**
సమాధానం: రోడ్డు నిర్మాణానికి గ్రామ సభలో ఆమోదం తెలిపారు. నిధులు రాగానే నిర్మిస్తాం. **-రామారావు, ఎంపీడీవో, అమరాపురం.**
సమస్య: వి.అగ్రహారం మారుతి కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. అంధకారంలో నెలకొంది. **-తిప్పేస్వామి.**
సమాధనం: రెండు రోజుల్లో ఏర్పాటు చేస్తాం. **-రామన్న, సర్పంచి.**
–న్యూస్‌టుడే, అమరాపురం

సమస్యకు స్పందన

స్పందనకు వందనం

పరిగి, న్యూస్‌టుడే: మేమున్నాం మీకు తోడుగా వార్తకు పంచాయతీ సహాయ కార్యదర్శి రంగనాథ్ స్పందించారు. పరిగిలోని షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో లీకేజీ అవుతున్న తాగునీటి పైప్‌లైన్‌కు పంచాయతీ సిబ్బందితో అవసరమైన మరమ్మతులు చేయించారు.

మోరీకి తాత్కాలిక మరమ్మతు

గుడిబండ, న్యూస్‌టుడే: మండలంలోని ఫళారం వీరకెంచమ్మ వంకపై గ్రామానికి చెందిన తెదేపా మైనార్టీ నాయకుడు మహబూబ్‌బాషా తాత్కాలిక మరమ్మతు చేయించారు. ఇటీవల కురిసిన వర్షానికి మోరీ దెబ్బతిని వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి ఉండేది. ఆదివారం పొక్లెయిన్‌తో గుంతను పూడ్చారు. రాళ్లు చదునుచేసి వాహనాలు వెళ్లేందుకు సౌకర్యం కల్పించారు. ఆయనకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

వెంకటాపురంలో ఉచిత వైద్య శిబిరం

హిందూపురం గ్రామీణం : వాసవ్య మహిళా మండలి, విప్రో కేర్ సహకారంతో కుశల్ హెల్త్ కేర్ క్లీనిక్ ఆధ్వర్యంలో చౌళూరు పంచాయతీలోని వెంకటాపురంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ అబ్దుల్ వాహీద్ శిబిరంలో పాల్గొని 80మంది రోగులకు వివిధ వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు.

పాఠశాల కరస్పాండెంట్‌కు పురస్కారం

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్లలోని నారాయణ ఇంగ్లిషు మీడియం పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మీపతి విద్యారంగంలో చేసిన సేవలకు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ పురస్కారం వరించింది. సదరన్ ప్రైవేటు లెక్చరర్స్, టీచర్స్ అసోసియేషన్ (ఎస్‌పీఎల్‌టీవో) ఆధ్వర్యంలో గుంటూరులోని ఆంధ్రా క్రిస్టియన్ కళాశాలలో ఆదివారం అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు నాగయ్య, ఎమ్మెల్సీ లక్ష్మణరావు చేతులమీదుగా అందుకున్నారు.

145 మందికి వైద్యసేవలు

హిందూపురం: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఆల్‌హిలాల్ పాఠశాలలో మూర్ఛవ్యాధి గ్రస్తులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 145 మందికి వైద్య సేవలు అందించినట్లు జేవీవీ జోనల్ ఉపాధ్యక్షుడు ఈడీ రామ్మూర్తి తెలిపారు. ఈ శిబిరానికి ఎన్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సూపరింటెండెంట్ నరసింహులు 10,116 విరాళంగా అందించారన్నారు. సంఘం ప్రతినిధులు రామకృష్ణ, శ్రీనివాసులు, నాగేంద్ర, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో చోరీలు.. భయాందోళనలో ప్రజలు

మడకశిర, న్యూస్‌టుడే : పట్టణంలోని హిందూపురం రోడ్డులో గల శల్య చికిత్సాలయం సమీపంలో సదాశివ అనే వ్యాపారి ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి నగదు, బంగారు ఆభరణాలు దోచుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. అదే విధంగా మధుగిరి రోడ్డులోని మారుతినగర్ అభయాంజనేయస్వామి ఆలయంలో హుండీ పగలగొట్టి భక్తులు వేసిన కానుకలను ఎత్తుకెళ్లారు. రెండు చోట్ల చోరీలు జరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సీఐ రామారావు ఆధ్వర్యంలో పోలీసులు చోరీలు జరిగిన చోట పరిశీలించి ఇలాంటివి జరగకుండా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దాడి ఘటనలో ఆరుగురిపై కేసు

గోరంట్ల : మండలంలోని గడ్డంతండాలో జరుగుతున్న ఊరేగింపు సందర్భంగా మౌనికాబాయి అనే మహిళపై దాడి జరిగింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆరుగురు తండావాసులపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు.

నేర కార్యకలాపాల్లో పాల్గొంటే కఠిన చర్యలు

గోరంట్ల, న్యూస్‌టుడే: ఇటీవల పలుప్రాంతాల్లో చోటుచేసుకున్న నేర కార్యకలాపాల నేపథ్యంలో యువత అలాంటి ఆలోచనలకు వెళితే కఠిన చర్యలు తప్పవని పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు, స్థానిక సీఐ శేఖర్‌లు హెచ్చరించారు. మండలంలోని పాలసముద్రం పరిసరాల్లో జరుగుతున్న పలు పరిశ్రమల నిర్మాణాల్లో ఉత్తర భారతదేశానికి చెందిన చాలారాష్ట్రాల యువకులు పెద్దసంఖ్యలో పనిచేస్తున్న నేపథ్యంలో ఆదివారం డీఎస్పీ ఆధ్వర్యంలో కుబేరహిల్స్‌లో వారిని సమావేశపరిచి అవగాహన కల్పించారు. వారు ఎక్కడ పనిచేస్తున్నారు, ఏప్రాంతం నుంచి వచ్చారు. ఏఏరాష్ట్రాలకు చెందిన వారు ఎంతమంది ఉన్నారనే వివరాలు సేకరించారు. అసాంఘిక కార్యకలాపాలు, నేర ఆలోచనలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాలసముద్రంలో కూడలిలో ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు.


యువతకు సూచనలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

ఘనంగా వాల్మీకి జయంతి

లేపాక్షి, న్యూస్‌టుడే: శిరివరంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో వాల్మీకి జయంతి వేడుకలను గ్రామ స్థలు వైభవంగా నిర్వహించారు. మహిళలు జ్యోతులను ఊరేగిస్తూ విగ్రహానికి హారతులు ఇచ్చారు.


ఊటుకూరులో జ్యోతులు మోస్తున్న మహిళలు

ఊటుకూరు (పరిగి): ఊటుకూరులో మహిళలు జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం వాల్మీకి మహర్షి విగ్రహాన్ని అలంకరించిన రథంపై ఉంచి గ్రామంలో ఊరేగించారు.

నాగలమడకకు పాదయాత్ర

పెనుకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని ఊరివాకిలి ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి ఆదివారం ఉదయం 35 కిలోమీటర్ల దూరంలోని కర్ణాటక సరిహద్దు ప్రాంతం నాగలమడక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి 50 మంది భక్తమండలి సభ్యులు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు.


పాదయాత్రగా బయలుదేరిన భక్తులు

ఘనంగా సత్యసాయి అవతరణ దినోత్సవం

సోమందేపల్లి, న్యూస్‌టుడే: సత్యసాయిబాబా అవతరణ దినోత్సవాన్ని ఆదివారం సేవా సమితి సభ్యులు, భక్తులు ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక భజన మండలిలో సత్యసాయి, శిర్డీసాయి చిత్రపటాలను ఎడ్లబండిపై గ్రామ ప్రధాన వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. భక్తులు, మహిళలు భక్తిశ్రద్ధలతో బాబాకు పూజలు జరిపించారు.

హిందూపురం అర్బన్(పాండురంగనగర్), న్యూస్‌టుడే: పట్టణంలోని పాండురంగనగర్‌లో ఉన్న సత్యసాయి సేవాసదన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయి అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.


చిత్రపటం ఊరేగింపులో కలశాల ప్రదర్శన


చిన్నారుల కలశాలతో సాయినాథుని ఊరేగిస్తూ

పాఠశాల నిర్మాణానికి స్థల పరిశీలన

పెనుకొండ, న్యూస్‌టుడే: మండలంలోని రాంపురం గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పులే బీసీ సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను ఆదివారం మధ్యాహ్నం బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పరిశీలించారు. పాఠశాలలో వసతులపై ఆరాతీశారు. అనంతరం హనుమపల్లి సమీపంలో ఎంజేపీ పాఠశాల పక్కా భవనాల నిర్మాణం కోసం స్థల పరిశీలన చేపట్టారు. స్థల పరిశీలన సమయంలో వర్షం కురుస్తున్నా ఆగకుండా వర్షంలో పసుపుకండువా తలపాగా చుట్టుకుని స్థలపరిశీలన నిర్వహించారు. కార్యక్రమంలో ఎంజేపీ పాఠశాలల జిల్లా కన్వీనర్ రమాదేవి, సిబ్బంది, ఎంపీడీవో నరేశ్‌కృష్ణ, రాంపురం సర్పంచి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్లలోని బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి రోహిల్‌కుమార్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు గోపాల్, వ్యాయామోపాధ్యాయుడు రామ్మోహన్‌లు తెలిపారు. ఈనెల మొదటి వారం అనంతపురంలో జరిగిన జిల్లాస్థాయి ఎంపిక పోటీలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు చెప్పారు. ఈనెల 21 నుంచి శ్రీసత్యసాయి జిల్లా ముదిరెడ్డిపల్లి జిల్లా పరిషత్తు బాలుర ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడని పేర్కొన్నారు. పాఠశాల సిబ్బంది విద్యార్థిని అభినందించారు.


రోహిల్ కుమార్

గుంతలకు మోక్షమెన్నడో...!

హిందూపురం పట్టణంలోని ఎంజీఎం పాఠశాల నుంచి రిలయన్స్ పెట్రోల్ బంకుకు వెళ్లే రహదారి మధ్య గుంత ఏర్పడి వాహనదారులకు, పాదచారులకు ఇబ్బందికరంగా మారింది. ఈ రహదారి గుండా బాగేపల్లి, లేపాక్షి, చిలమత్తూరు తదితర ప్రాంతాలకు వందలాది వాహనాలు వెళ్తుంటాయి. రాత్రి సమయాల్లో ఇబ్బందిగా మారింది. ఈ విషయమై ఆర్అండ్‌బీ ఏఈ మోహన్‌ను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.
–న్యూస్‌టుడే, హిందూపురం అర్బన్



ఆధార్ శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

మడకశిర గ్రామీణం: ఈ నెల 22 నుంచి 26వ తేది వరకు సచివాలయాల్లో నిర్వహించే ఆధార్ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సోనిబాయి తెలిపారు. బుళ్లసముద్రం, హరేసముద్రం, కల్లుమర్రి, మెళవాయి, ఆమిదాలగొంది పంచాయతీ కేంద్రాలలో ఈ శిబిరాలు ఉంటాయన్నారు.

వైకాపా ఎంపీటీసీ సభ్యుడిపై కేసు

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్ల మండలం బూదిలి పంచాయతీ వైకాపా ఎంపీటీసీ సభ్యుడు మంజునాథ్ కర్ణాటక మద్యం అక్రమంగా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు సీఐ శేఖర్ తెలిపారు. కర్ణాటకలోని పెసలపర్తికి చెందిన అతడి అల్లుడు విశ్వనాథ్‌తో కలిసి కర్ణాటక మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నట్లు తెలిసిందన్నారు. ఈక్రమంలో ఆదివారం మంజునాథ్ వద్ద 480 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసికొని అతడిని అదుపులోకి తీసుకోగా అల్లుడు పారిపోయినట్లు చెప్పారు.

రహదారంతా బురద.. నడిచేదెట్లా?



నాగిరెడ్డిపల్లిలో ప్రధాన రహదారి అధ్వానంగా తయారైంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి స్థానిక అంగన్‌వాడీ కేంద్రం సమీపంలో ఎస్సీ కాలనీకి వెళ్లే సీసీ రోడ్డుకు కాలువలు లేక వర్షం నీరు నిలిచి బురదగా మారింది. వాహనదారులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా దారికి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, రొద్దం

పైప్‌లైన్‌కు తవ్విన గుంతలో కుంగిన వాహనం

అగళి, న్యూస్‌టుడే: జాతీయ రహదారి 544 పక్కనే ఓ ప్రైవేట్ కంపెనీ గ్యాస్ సరఫరా కోసం భారీ మొత్తంలో పైప్‌లైన్ ఏర్పాటు చేసింది. జాతీయ రహదారికి సరిపడ దూరంలో నిబంధనల ప్రకారం పనులు చేపట్టాల్సి ఉన్నా పక్కనే తవ్వడంతో వాహనాలు ఇరుక్కుంటున్నాయి. ఆదివారం మండలంలోని హెచ్‌డీ.హళ్లి క్రాస్ వద్ద తండావెళ్లే ప్రధాన రోడ్డులో ఓ లారీ పార్కింగ్ చేయబోయి అందులో కుంగిపోయింది.


కుంగిన రోడ్డులో ఇరుక్కున్న వాహనం

సైకిల్‌ను తప్పించబోయి కార్మికుడి మృతి

పెనుకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని శ్రీమిట్టాంజనేయస్వామి ఆలయలం వద్ద ప్రధాన రోడ్డుపై అడ్డుగా వచ్చిన సైకిల్‌ను తప్పించబోయి ద్విచక్రవాహన చోదకుడు మనోజ్‌కుమార్ డివైడర్‌ను ఢీకొని తీవ్రగాయాలపాలయ్యాడు. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా.. పట్టణంలోని కొండాపురంరోడ్డు పక్కన నివాసం ఉంటున్న చంద్ర, లక్ష్మీదేవిల ఒక్కగానొక్క కుమారుడు మనోజ్‌కుమార్(20) శనివారం రాత్రి పట్టణ శివారులోని టీకొట్టులో టీతాగి ద్విచక్రవాహనంపై ఇంటికి వెళుతుండగా ఎదురుగా వచ్చిన సైకిల్‌ను తప్పించబోయి డివైడర్‌ను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రున్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. అక్కడి నుంచి బెంగళూరు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడు కియా అనుబంధ సంస్థలో కార్మికుడిగా పనిచేస్తుండేవాడు. చేతికొచ్చిన కుమారుడు మరణించడంతో తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. తండ్రి చంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.



రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

రొళ్ల : మడకశిర ప్రాంతం కళ్లుమర్రి గ్రామ సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో రొళ్ల భార్యాభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని హనుమంతనపల్లి గ్రామానికి చెందిన లక్ష్మమ్మ, తిమ్మరాజులు ఆదివారం పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంలో హిందూపురం వెళుతుండగా ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. క్షతగాత్రులను హిందూపుం ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం బెంగళూరు తీసుకెళ్లారు.

భగ్గుమన్న కూరగాయల ధరలు

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: మడకశిర మండలం కదిరేపల్లి వారపు సంతలో ఆదివారం కూరగాయల ధరలు భగ్గుమన్నాయి. నెల రోజులుగా కురుస్తున్న వర్షాల ప్రభావంతో కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. అరకొరగా ఉన్న పంటలతో ధరలు విపరీతంగా పెరిగాయి.



ధరలు కిలో

	నెల కిందట	ప్రస్తుతం (రూ.లలో)
వంకాయలు :	20	50
బెండ :	30	60
బీన్స్ :	60	100
టమాట :	20	50
బంగాళదుంపలు:	40	60
క్యారెట్ :	40	60

నెల రోజులుగా వారపు సంతకు రాని రైతులు

వారపు సంతకు మడకశిర, గుడిబండ మండలాల గ్రామాల నుంచి రైతులు కూరగాయలను తీసుకొచ్చి విక్రయించేవారు. కూరగాయలు కూడా తాజాగా దొరికేవి. నెల రోజులుగా వారపు సంతకు రైతులు కూరగాయలు తీసుకురాకపోవడంతో డిమాండు పెరిగింది. స్థానిక వ్యాపారులు హిందూపురం, తుమకూరు, గౌరీబిదనూరు తదితర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. అక్కడ కూడా హోల్‌సేల్ ధరలే విపరీతంగా ఉండడంతో దినసరి, వారపు సంతల్లో అధిక ధరలకు విక్రయించక తప్పడం లేదని వ్యాపారులు తెలిపారు.


కదిరేపల్లి వారపు సంతకు వచ్చిన అరకొర కూరగాయలు

ఏది కొనాలన్నా కిలో రూ. 50పైనే

ధరలు విపరీతంగా పెరిగాయి. ఏది కొనాలన్నా కిలో రూ.50పైనే ధర ఉంది. గతంలో రూ.300లు తీసుకొస్తే ఐదు మంది ఉన్న మా కుటుంబానికి వారానికి సరిపడ కూరగాయలు వచ్చేవి. ప్రస్తుతం ధరలు రెండింతలవడంతో కొనేందుకు ఇబ్బందులు పడుతున్నాం. కూరగాయల ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండేవిధంగా ప్రభుత్వం చూడాలి. **భాగ్యమ్మ, గృహిణి**



పుట్టపర్తి
•పుట్టపర్తి •ధర్మవరం •కదిరి •రాప్తాడు



వీధుల్లో నీరు.. రాకపోకలకు బేజారు

కదిరిలోని పిల్లవంక కాలనీలో వీధులు మురుగు, వర్షపు నీటితో మడుగుల్లా మారాయి. దీంతో కాలనీవాసుల రాకపోకలకు ఇబ్బంది తయారైంది. దీనికి తోడు కుళాయిల మరమ్మతులకని గుంతలు తీసి వదిలేశారు. గుంతలు పూడ్చక పోవడంతో వాటిల్లో నీరు నిల్వ చేరాయి. దీంతో వీధుల్లో రాకపోకలకు ప్రజలు, వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. సమస్యను కమిషనర్ కిరణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా పరిష్కారానికి తగిన చర్యలు చేపడతామన్నారు.

– న్యూస్‌టుడే, కదిరి

దాతల చేయూత అభినందనీయం

ధర్మవరం, న్యూస్‌టుడే : పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో ఆదివారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రోటరీ క్లబ్ సత్యసాయి జోన్ అసిస్టెంటు గవర్నర్ ప్రభాకర్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోట రీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యశిబిరాలు ఎంతో మందికి కంటిచూపును ఇస్తున్నాయన్నారు. వైద్య శిబిరాల నిర్వహణకు దాతలు చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి 63 మందిని ఆపరేషన్ల కోసం ఎంపిక చేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జయసింహ, కోశాధికారి సుదర్శన్‌గుప్తా, ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి, రోటరీక్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

పుట్టపర్తి, న్యూస్‌టుడే : జిల్లాలోని అప్రైజర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా అప్రైజర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగభూషణాచారి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సాయి దర్బార్‌లో ఆ సంఘం సమావేశం నిర్వహించారు. బ్యాంకు వచ్చే ఖాతాదారుల విషయంలో బంగారు నాణ్యతను పరీక్షించి జాగ్రత్తలు పాటించి, న్యాయం చేస్తామన్నారు. ఎలాంటి సమస్యలు వచ్చినా సంఘటితంగా పరిష్కరించుకుందామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు డంకనాచారి ఆధ్వర్యంలో నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నాగభూషణాచారి, కమిటీ సభ్యులుగా ఇబ్రాన్, బుజ్జి, సుధాకర్‌ఆచారి తదితరులు పాల్గొన్నారు.

నేడు వినతుల స్వీకరణ

పుట్టపర్తి, న్యూస్‌టుడే : శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్, జిల్లా పోలీసు కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక (జీపీఆర్ఎస్)లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీరత్న, తెలిపారు. డివిజన్, మున్సిపాలిటీ, మండల కేంద్రాల్లోనూ సంబంధిత అధికారులు వినతులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

తరగతి గదులు శిథిలం.. విద్యార్థులకు ప్రాణసంకటం




తాడిమర్రి ఉన్నత పాఠశాలలో నెర్రెలిస్తున్న తరగతి గది



పెద్దన్నగారిపల్లిలో చిన్నపాటి చినుకులకే కారుతున్న ప్రాథమిక పాఠశాల

ధర్మవరం పట్టణం, తాడిమర్రి, ముదిగుబ్బ, న్యూస్‌టుడే : ధర్మవరం నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా ఉన్నాయి. మూడు దశబ్దాలు కిందట నిర్మించిన భవనాలు కావడంతో పూర్తిగా దెబ్బతిన్నాయి. పెచ్చులూడి తరచూ కింద పడుతున్నాయి. గదుల పై కప్పు, గోడలు ఎక్కడికక్కడే బీటలు వారి సిమెంట్ పెళ్లలు ఊడుతున్నాయి.

- మూడేళ్ల కిందట తాడిమర్రి ఉన్నత పాఠశాలలో గది పైపెచ్చులూడి విద్యార్థి తలపై పడటంతో తీవ్ర గాయాలయ్యాయి.
- ఇదే పాఠశాలలో ఇటీవల దసరా సెలవుల్లో తరగతి పై కప్పు ఊడి కిందపడింది. ఆ ప్రదేశంలో నిద్రిస్తున్న వాచ్‌మెన్ రమణకు త్రుటిలో ప్రమాదం తప్పింది. ఈ రెండు గదులకు నాడు - నేడు పథకం కింద రూ.కోటి నిధులతో పనులు చేయించారు. మండలంలో 5 పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరాయి.
- ముదిగుబ్బ బాలుర ఉన్నత పాఠశాలలో రెండేళ్ల కిందట తరగతి గది పైకప్పు పెచ్చులూడి విద్యార్థికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ మండలంలో సుమారుగా 7 పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. నాడు - నేడు పథకానికి ఎంపికైనా నిధులు మంజూరు కాలేదు. బత్తలపల్లి మండలంలోనూ పలు పాఠశాలల భవనాల దుస్థితి ఇలానే ఉంది.



ఇటీవల ఉన్నత పాఠశాల తరగతి గది పెచ్చులూడి కిందపడిన సిమెంట్ పెళ్లలు

నాసిరకంగా పనులు

గత వైకాపా ప్రభుత్వ హయాంలో నాడు - నేడు పథకం కింద కొన్ని పాఠశాల భవనాల మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. అయితే చాలాచోట్ల పనులు నాసిరకంగా జరిగాయి. దీంతో వర్షాకాలంలో పైకప్పు, గోడల ద్వారా నీరు తరగతి గదుల్లోకి చేరుతోంది. దీంతో కొన్ని ఆ గదులను తాత్కాలికంగా మూసి వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో కొందరు స్థానిక అధికారులు ప్రధానోపాధ్యాయులతో కుమ్మక్కై నాసిరకంగా పనులు చేయించి బిల్లులను కాజేశారనే ఆరోపణలున్నాయి.

ఆ గదులను మూసివేస్తాం

ప్రమాదకరమైనవి, శిథిలావస్థకు చేరుకున్న గదులను పరిశీలించి వాటికి మరమ్మతులు చేయిస్తాం. పూర్తిగా దెబ్బతిన్న వాటిని మూసివేసేలా చర్యలు తీసుకుంటాం. క్షేత్రస్థాయిలో భవనాలను పరిశీలిస్తాం.

– కృష్ణమోహన్, రమణప్ప, ఎంఈఓలు, తాడిమర్రి, ముదిగుబ్బ

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

పుట్టపర్తి: 80085 73039, కదిరి: 80085 73033, ధర్మవరం: 99596 98222

సమస్య : తలుపుల - గంజివారిపల్లి ప్రధాన రోడ్డుపై నీటి మడుగు ఏర్పడి ఇబ్బందికరంగా ఉంది. వాహనాలు వేగంగా వెళ్లినప్పుడు బురదనీరు ఎగిరొచ్చి పడుతున్నాయి. **- బాబురెడ్డి, తలుపుల**

సమాధానం : అది ఆర్అండ్‌బీ రోడ్డు. నిర్మించినప్పుడే అక్కడ పల్లంగా వేయడంతో సమస్యగా మారింది. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం. **- అనిల్‌కుమార్, ఇన్‌ఛార్జి కార్యదర్శి, తలుపుల**

సమస్య : పూలబజార్‌కు సక్రమంగా తాగునీటిని సరఫరా చేయలేదు. అధికారులు చర్యలు తీసుకోవాలి. **- వలి, పూలబజార్, తలుపుల**

సమాధానం : తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటాం. **- అనిల్‌కుమార్, ఇన్‌ఛార్జి కార్యదర్శి, తలుపుల**

– న్యూస్‌టుడే, తలుపుల

చెరువులకు హంద్రీనీవా జలాలు



కుంటిమద్ది చెరువు వద్ద ఎమ్మెల్యే పరిటాల సునీత, నాయకులు

రామగిరి: రాప్తాడు నియోజకవర్గానికి హంద్రీనీవా నీటిని తెచ్చిన ఘనత తెదేపాకే దక్కుతుందని సునీత అన్నారు. ఆదివారం రామగిరి మండలం కుంటిమద్ది చెరువులో నిర్వహించిన గంగపూజలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆమెతోపాటు మనవడు జూనియర్ పరిటాల రవీంద్ర కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చెరువు నిండి ప్రవహిస్తుంటే రైతుల్లో ఆనందం కనిపిస్తోందన్నారు.

ఆరోగ్యశ్రీ అన్నారు.. డబ్బులు తీసుకున్నారు..

రామగిరి మండలం గంగంపల్లి తండాకు చెందిన శ్రీకాంత్ ఇటీవల అనారోగ్యంతో అనంతపురంలోని ఓ ఆసుపత్రిలో చేరారు. ఆరోగ్యశ్రీ కార్డుతో ఆసుపత్రిలో చేరినా, డబ్బులు చెల్లిస్తేనే ఆపరేషన్ చేస్తామని డిమాండ్ చేయడంతో చేసేదిలేక రూ.30,000 కట్టామని బాధితులు వాపోయారు. శనివారం పల్లె పండుగ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేతో బాధితులు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే డీఎంహెచ్‌ఓతో ఫోన్‌లో మాట్లాడి ఎందుకు డబ్బులు కట్టించుకున్నారని ప్రశ్నించారు.

బత్తలపల్లి జట్టుపై ధర్మవరం విజయం



బన్నీ కుందన్

ధర్మవరం పట్టణం, బత్తలపల్లి, న్యూస్‌టుడే : ఆర్డీటీ నిర్వహిస్తున్న రూరల్ క్రికెట్ లీగ్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఆదివారం బత్తలపల్లిలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో ధర్మవరం అండర్-15, బత్తలపల్లి అండర్-15 జట్ల మధ్య క్రికెట్ పోటీ జరిగింది. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ధర్మవరం జట్టు 33 ఓవర్లలో 153 పరుగులకు ఆలౌట్ అయింది. బన్నీ 79 పరుగులు సాధించి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. బత్తలపల్లి జట్టులోని నరసింహ 4 వికెట్లు తీశారు. అనంతరం 154 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన బత్తలపల్లి జట్టు 31.1 ఓవర్లలో 100 పరుగులకే ఆలౌటైంది. 53 పరుగులతో ధర్మవరం జట్టు విజయం సాధించింది. జట్టులో కుందన్ 4 వికెట్లు, సాంబశివ, జస్వంత్ చెరో రెండు వికెట్లు తీశారు. మ్యాచ్‌కు కోచ్ రాజశేఖర్ పర్యవేక్షించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



పవన్‌కుమార్ విష్ణు జయంత్

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే : ఈ నెల 27 నుంచి 29 వరకు రాయలసీమలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు పవన్‌కుమార్, విష్ణు, జయంత్ ఎంపికైనట్లు కోచ్ పృథ్వీ తెలిపారు. శ్రీవివేకానంద స్పోర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్డీటీ క్రీడా మైదానంలో పలువురు క్రీడాకారులు కబడ్డీలో శిక్షణ పొందుతున్నారు. ఈ నెల 19వ తేదీన ఆర్డీటీ మైదానంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 విభాగంలో జిల్లా స్థాయిలో కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మంచి ప్రతిభను కనబరిచి క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు నిర్వాహకులు ఎంపిక చేశారని కోచ్ పేర్కొన్నారు. వీరితోపాటు బాలికల జట్టుకు అస్మిత, నవ్యలు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పలువురు అభినందనలు తెలిపారు.

ఘనంగా సత్యసాయిబాబా అవతరణ దినోత్సవం



ధర్మవరంలో బాబా చిత్రపటం ఊరేగింపు

ధర్మవరం, న్యూస్‌టుడే : సత్యసాయిబాబా అవతార ప్రకటన దినోత్సవాన్ని సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం ధర్మవరంలో ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ కూడలి నుంచి ప్రధాన రహదారుల మీదుగా సత్యసాయిబాబా చిత్రపటాన్ని ఊరేగించారు. సత్యసాయి జిల్లా బాలవికాస్ ఇన్‌ఛార్జి ఆదిలక్ష్మి, జిల్లా గ్రామ సేవ ఇన్‌ఛార్జి శేషాచారి, సమితి పదాధికారులు బాలవికాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

కదిరి : పట్టణంలోని బృందావనంలో ఆదివారం ఉచిత సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. భగవాన్ శ్రీసత్యసాయిబాబా 99వ జయంతి సందర్భంగా శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సామూహిక వ్రతం చేశారు. ఉదయం 9 గంటలకు పతాకావిష్కరణ, జ్యోతి వెలిగించి, 10 గంటలకు అష్టోత్తర పూజలు అనంతరం వ్రతం ఆరంభించారు. వ్రతం ముగియగానే మంగళ హారతి ఇచ్చారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కదిరి : సత్యనారాయణ స్వామి వ్రత పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

జూదరుల అరెస్ట్

తనకల్లు, న్యూస్‌టుడే : మండలంలోని అగ్రహారం వద్ద కోడిపందేల స్థావరాలపై ఆదివారం దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. కోడిపందేలు ఆడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని రూ.1,850 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు.

గొలుసు దుకాణాలు నిర్వహిస్తే చర్యలు

బుక్కపట్నం : గ్రామాల్లో ఎవ్వరైనా గొలుసు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. బుక్కపట్నం మండలం చంద్రాయునిపల్లి, గూనిపల్లి గ్రామాల్లో ఆదివారం ఎస్ఐ పర్యటించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఎవరూ గొలుసు దుకాణాలు నిర్వహించినా పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

ఏపీజే అబ్దుల్ కలాం పురస్కారం ప్రదానం



జయసింహారెడ్డిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణ రావు, ఎస్పీఎల్‌టీఏ సభ్యులు

ఓబులదేవరచెరువు, న్యూస్‌టుడే : స్థానిక రెయిన్‌బో పాఠశాల కరస్పాండెంట్ జయసింహారెడ్డికి ప్రతిష్ఠాత్మక డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం జాతీయ ప్రతిభ అవార్డు వరించింది. ఆయన విద్యా రంగంలో చేసిన సేవలను గుర్తించి ఈ అవార్డును సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ అసోసియేషన్ (ఎస్పీఎల్‌టీఏ) ఆదివారం గుంటూరు ఆంధ్ర క్రిష్టియన్ కళాశాలలో జరిగిన ప్రత్యేక సభలో ప్రదానం చేసింది. ఎస్పీఎల్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు నాగయ్య, ఎమ్మెల్సీ లక్ష్మణరావు చేతుల మీదుగా జయసింహారెడ్డి పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

పురుగు మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

తలుపుల, న్యూస్‌టుడే : తలుపుల ఎగువపేటకు చెందిన వృద్ధుడు కప్పరాజు శ్రీనివాసులు (63) పురుగు మందు తాగి, అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు. మద్యానికి బానిసైన అతను కడుపు నొప్పితో బాధపడుతుండేవాడు. వైద్యులు మద్యం తీసుకోవద్దని సూచించారు. మద్యం తాగొద్దని కుటుంబ సభ్యులు చెప్పినందుకు మనస్తాపం చెందిన అతను ఈ నెల 19న శనివారం పురుగు మందు తాగడంతో అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్ఐ చెప్పారు. అతనికి భార్య కుమారుడు, కోడలు, మనుమళ్లు ఉన్నారు. భార్య అనసూయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి



సుంకర నాగమ్మ

ధర్మవరం, న్యూస్‌టుడే : ధర్మవరంలోని గాంధీనగర్‌కి చెందిన శతాధిక వృద్ధురాలు సుంకర నాగమ్మ (106) శనివారం మృతి చెందింది. ఆమె భర్త ఇది వరకే మృతి చెందారు. వందేళ్లకు పైగా ఆరోగ్యంగా జీవించిన నాగమ్మ అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. నాగమ్మకు కుమారుడు నారాయణ, మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు.

వాహనం బోల్తా.. తప్పిన ప్రమాదం

ముదిగుబ్బ, న్యూస్‌టుడే : అనంతపురం నుంచి కదిరి వైపు ఎరువు లోడుతో వెళ్తున్న ఐచర్ ఆదివారం ఉదయం ముదిగుబ్బ మండలంలోని రాళ్ల అనంతపురం సమీపంలో బోల్తాపడింది. డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతో మలుపులో అదుపు తప్పి బోల్తాపడగా డ్రైవర్, క్లీనర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు. ఈ ఘటనపై పోలీసులు పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టారు.


తెదేపా ఎస్సీ సెల్ సభ్యుడి మృతికి సంతాపం

నంబులపూలకుంట (గాండ్లపెంట), న్యూస్‌టుడే : మండలంలోని దిగువ గూటిబైలు గ్రామానికి చెందిన తెదేపా ఎస్సీసెల్ సభ్యుడు తిమ్మప్ప అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబానికి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ రూ.20 వేలు ఆర్థికసాయం అందించి సంతాపం తెలిపారు. అంత్యక్రియల్లో మండల కన్వీనర్ చంద్రశేఖర్ నాయుడు,నాయకులు వెంకటనారాయణ, సర్పంచి విష్ణుమూర్తి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే గ్రామాభివృద్ధి

ధర్మవరం, న్యూస్‌టుడే : గొట్లూరులో రూ.98 లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గొట్లూరులో పల్లె పండగ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. గొట్లూరులో మంత్రి, నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డికి గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. వాల్మీకి విగ్రహానికి మంత్రి పూలమాల వేశారు. గ్రామంలో సంపద తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. సీసీ రహదారుల పనులకు శంకుస్థాపన చేశారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కమతం కాటమయ్య, భాజపా నాయకుడు గొట్లూరు చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి : కూటమి ప్రభుత్వం రాగానే పల్లెలకు పండగ వచ్చిందని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ఏకపాదంపల్లిలో పల్లెపండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి, తెదేపా ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్‌రెడ్డితో కలిసి హాజరై పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్డీఓ మహేశ్, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, తెదేపా మండల అధ్యక్షుడు రామ్మోహన్, గ్రామ సర్పంచులు నాగవేణి, భూషన్ తదిరులు పాల్గొన్నారు.



గొట్లూరులో మంత్రి సత్యకుమార్ యాదవ్, పరిటాల శ్రీరామ్, మధుసూదన్‌రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న గ్రామస్థులు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే : ముదిగుబ్బలో ప్రధానంగా ఉన్న తాగునీటి సమస్యతోపాటు రాచువారిపల్లితండా దగ్గర మద్దిలేరు వారుపై వంతెన నిర్మిస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హామీ ఇచ్చారు. ఆదివారం ముదిగుబ్బలోని టీచర్స్‌లో కాలనీలో పల్లె పండగ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన రూ.60 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. మంత్రితోపాటు ఎంపీ బీకే పార్థసారథి, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. ముదిగుబ్బలో మండల గ్రాంట్, ఎంపీ నిధుల కింద మొత్తం రూ.20 కోట్లు కేటాయించామని, వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి సమస్యలు తీరుస్తామన్నారు. సానేవారిపల్లిలో తాగునీటి సమస్య తీర్చేందుకు రూ.7 లక్షలు కేటాయిస్తున్నట్లు ఎంపీ బీకే పార్థసారథి తెలిపారు. అనంతరంలో వైకాపాకు చెందిన జడ్పీటీసీ సభ్యురాలు తిరుమలాబాయి, ఆమె భర్త సేవేనాయక్, ఎంపీటీసీ సభ్యులులు నాగప్ప, జయబాయి, తిరుపాలమ్మ, సర్పంచులు నాగభూషణ, పసన్నలక్ష్మి, వేణుగోపాల్, మాజీ సర్పంచి తిరుపాలు, పట్ర సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటకృష్ణ పలువురు వైకాపా నుంచి భాజపాలోకి మంత్రి ఆధ్వర్యంలో చేరారు. ఆర్డీఓ మహేశ్, ఎంపీపీ ఆదినారాయణ యాదవ్, కూటమి నాయకులు ప్రభాకర్, సోమల ప్రకాశ్‌నాయుడు, మనోహర్, కోట్లబాబి, వినోద్‌కుమార్, అశోక్ పాల్గొన్నారు.

ప్రతి హామీ నెరవేర్చడమే లక్ష్యం

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే : ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే లక్ష్యంగా కృషి చేస్తామని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం కదిరి మండలం పట్నం గ్రామ పంచాయతీ పరిధిలో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా రూ.29.80 లక్షలతో చేపట్టనున్న 11 సీసీ రహదారుల నిర్మాణాలకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కదిరి నియోజకవర్గంలోని ప్రతి మండలంలో రూ.3 కోట్లతో సీసీ రహదారులు, మౌలిక వసతుల కల్పనకు పనులు ప్రారంభించామన్నారు. నిరుద్యోగులు ఉపాధికి 92 ఎకరాల్లో నూతన పారిశ్రామిక వాడ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పోలప్ప, ఏపీడీ రమేశ్ బాబు, తెదేపా మండల కన్వీనర్లు చెన్నకేశవులు, హరి, నాయకులు ప్రసాద్, చంద్రశేఖర్, లోకేశ్, రమేశ్‌బాబు, రమణప్ప, సర్పంచి చలపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.



గరికపల్లిలో కొబ్బరికాయ కొడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

తలుపుల : కూటమి ప్రభుత్వంతోనే గ్రామీణాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం తలుపుల మండలం ఓబులరెడ్డిపల్లి పంచాయతీ గరికపల్లిలో నిర్వహించిన పల్లె పండగ కార్యక్రమంలో ఆయన పాల్గొని రూ.15 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దారు రెడ్డిశేఖర్, ఎంపీడీఓ రామానాయక్, ఏపీఓ హరూన్‌రషీద్, వైద్యులు ఆఫ్తాఫ్, ఏఓ షాదాబ్, కూటమి నాయకులు రామకృష్ణారెడ్డి, జయరామ్, ముబారక్, శంకర, మనోహర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై ఊటనీటితో ఇక్కట్లు

కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ధర్మవరంలోని పార్థసారథినగర్ వద్ద ఊటనీరు ప్రధాన రహదారిపైకి చేరుతోంది. ధర్మవరం నుంచి లక్ష్మీచెన్నకేశవపురం, ఎన్.ఎస్.గేట్, పుట్టపర్తి ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ మార్గంలోనే వాహనదారులు రాకపోకలు చేయాల్సి ఉంది. రోజుల తరబడి ఊటనీరు పారుతుండటంతో రహదారి పాచిపట్టి వాహన చోదకులు జారిపడుతున్నారు. రహదారిపైకి ఊటనీరు చేరకుండా రహదారి పక్కన కాలువ ఏర్పాటు చేయాలని స్థానికులు ఆర్అండ్‌బీ, పురపాలకశాఖ అధికారులను కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ధర్మవరం



కల్వర్టు ధ్వంసం.. పొంచి ఉన్న ప్రమాదం



ముదిగుబ్బలోని టీచర్స్ కాలనీలో మెయిన్ రోడ్డు నుంచి అనుసంధానం చేసిన రహదారికి మధ్య నిర్మించిన కల్వర్టు విరిగిపోయింది. దీంతో మలుపులో రాకపోకలకు సాగించేందుకు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. శుద్ధజల ఆటోలు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. టీచర్స్ కాలనీలోని పలుచోట్ల ఇలాగే కల్వర్టు ధ్వంసం కావడంతో రోడ్డుదాటేందుకు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. పలుచోట్ల రోడ్డు ధ్వంసంకావడం, మట్టిరోడ్డు ఉండటంతో చిన్నపాటి వర్షానికే రహదారి రొచ్చుగా మారుతోంది. అధికారులు స్పందించి కల్వర్టు నిర్మించాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, ముదిగుబ్బ

పైకి ఉబికె వేగంగా




మండలంలోని తూంచెర్ల గ్రామ సమీపంలో దోబీఘాట్‌కు ఏర్పాటు చేసిన బోరు బావి నుంచి గంగ ఉబికి బయటకు వస్తుండటంతో ప్రజలు ఆ దృశ్యాన్ని ఆశ్చర్యకరంగా చూస్తున్నారు. గ్రామానికి సమీపంలో ఉన్న వంక వద్ద రజకుల సౌకర్యార్థం దోబీఘాట్‌ను కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. కొద్ది రోజుల నుంచి హంద్రీనీవా నీరు వంక వెంబడి ప్రవహించడమే కాకుండ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు భూమిలో తేమశాతం పెరగడంతో 260 అడుగుల లోతు ఉన్న బోరు బావిలో నుంచి నీరు విద్యుత్తు మోటారు ఆన్ చేయకుండానే బయటకు వస్తుండటంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, కనగానపల్లి

నిర్లక్ష్యం పైకి పాకింది

మండలంలోని జానకంపల్లి గ్రామంలోని సత్యసాయి తాగునీటి ట్యాంకు పైకి ఎక్కడానికి ఇనుప నిచ్చెన ఏర్పాటు చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆ నిచ్చెన కనిపించకుండా చెట్ల తీగలు అల్లేసుకున్నాయి. చెట్ల తీగలే కదా అని నిర్లక్ష్యంగా వదిలేశారు. ఇటీవల ఆ తీగల వెంట పైకి ఒక పాము వెళ్లింది. పైకి వెళితే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చెట్ల తీగలను తొలగించి ప్రమాదాన్ని నివారించాలని ప్రజలు కోరుతున్నారు.



– న్యూస్‌టుడే, బుక్కపట్నం